## ఈ నెల 26 నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడలు..

### క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు చేయండి - కలెక్టర్

**కర్నూలు, డిసెంబరు 19, ప్రభాతవార్త :**
ఈ నెల 26 వ తేదీన ఆడుదాం ఆంధ్ర క్రీడలు ప్రారంభమవుతున్నందున పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆడుదాం ఆంధ్ర నిర్వహణ పై మండల స్పెషల్ ఆఫీసర్‌లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లేయర్ రిజిస్ట్రేషన్ దాదాపు పూర్తి అయిందని, ఇక టీమ్స్ ఏర్పాటు, గ్రౌండ్స్ గుర్తింపు పై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో 5 క్రీడలను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అందుకనుగుణంగా గ్రౌండ్స్‌ను గుర్తించి ఆడడానికి వీలుగా ఉండేలా వాటిని సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆయా క్రీడలకు సంబంధించిన క్రీడాకారులతో టీములు ఏర్పాటు చేయాలన్నారు. ఏ సచివాలయం, ఏ గ్రౌండ్ లో, ఏ టీమ్ ఆడతారు అన్న వివరాలతో షెడ్యూల్ ను రూపొందించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు,మూడు రోజుల్లో ఈ ప్రక్రియలన్నీ పూర్తి కావాలన్నారు. క్రీడాకారులకు అవసరమైన కిట్స్ పూర్తి స్థాయిలో చేరాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. తాగునీటి తో పాటు క్రీడాకారులకు తప్పనిసరిగా భోజన సదుపాయం కల్పించాలన్నారు. ఇందుకోసం నేడో, రేపో నిధులు విడుదల కానున్నాయని కలెక్టర్ తెలిపారు. ఆయా క్రీడలకు రెఫరీలుగా వ్యవహరిస్తున్న వారు క్రీడలకు సంబంధించిన నియమ నిబంధనలపై పూర్తిగా స్పష్టత కలిగి



ఉండాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు గురువారం వారికి కేటాయించిన మండలాలకు వెళ్లి, ఏర్పాట్లన్నీ సజావుగా జరుగుతున్నాయా లేదా పరిశీలించాలన్నారు. సచివాలయానికి ఒక మండల స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించుకోవాలని కలెక్టర్ మండల స్పెషల్ ఆఫీసర్ లకు సూచించారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్,జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డిఎస్డిఓ శ్రీనివాసరావు, మండల స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## మీ అధినేత కుటుంబ సభ్యులు ఎన్నిపార్టీల్లో ఉన్నారో.. ఆత్మవిమర్శ చేసుకోండి

**- టీజీ భరత్**

**కర్నూలు న్యూసిటి, డిసెంబరు 19, ప్రభాతవార్త:**
తమ కుటుంబంపై ఇష్టానుసారంగా విమర్శలు చేసిన ఓ పెద్ద మనిషి ముందుగా వారి పార్టీ అధినేత ఆయన చెల్లెలు ఏ ఏ పార్టీల్లో ఉన్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ టీజీ భరత్ అన్నారు. నగరంలోని జోహరాపురంలో టిడిపి నేత జేమ్స్ అధ్వర్యంలో వైసీపీకి చెందిన యువకుడు ఆనంద్ ఆపార్టీని వీడి తన మిత్రులతో కలిసి టిడిపి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీజీ భరత్ వీరికి పార్టీ కండువాలు వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా టీజీ మాట్లాడుతూ రాజకీయ లబ్దికోసం తమపై ఇష్టానుసారంగా మాట్లాడడం సరైంది కాదన్నారు. 2009 వరదల సమయంలో తాము కట్టుబట్టలతో ఇంటి నుండి బయటకు వచ్చినట్లు తెలిపారు. అప్పట్లో తమ తండ్రి టీజీ వెంకటేష్ అధికారులతో కూర్చొని ఈప్రాంత ప్రజలు వరదల నుంచి బయటపడేందుకు..

2లో



# సిమెంట్ ఫ్యాక్టరితో..పర్యావరణం అస్తవ్యస్తం...!

- నల్లమల అటవీ ప్రాంతంలో అంతరించి పోయిన పక్షిజాతి
- ఆత్మకూరు వన్యప్రాని డివిజన్‌లో కనుమరుగైన బట్టమేకపక్షి
- బహుమతులతోనే సరిపెట్టుకుంటున్న అటవీశాఖ అధికారులు
- వన్యప్రానులు, పక్షిజాతి పై పర్యవేక్షణ లేదు
- గాడితప్పిన అడ్మిస్ట్రేషన్ అధికారి పరిపాలన...

• వివరాలు 2లో






**పర్యావరణ పరిరక్షణ కాపాడే విదంగా అందరు సహకరించుకోవాలని ఎంతో గొప్పగా చెబుకునే అధికారులే ఆ పర్యావరణంపై చిన్న చూపు చూస్తూ అంతరించిపోతున్న జంతుజాలం పక్షి జాతిపై పర్యవేక్షణ కరవైందని చెప్పవచ్చు. కేవలం బహుమతులతోనే సరిపెట్టుకుంటూ కరిధైన కారులతో అటవీశాఖ అధికారులు హల్‌చల్ చేస్తున్న తీరుపై ప్రత్యేక కథనం..**

*నంద్యాల, ప్రభాతవార్త ప్రతినిధి:*

నల్లమల అటవీ ప్రాంతంలోని వన్యప్రాని ఆత్మకూరు అటవీ డివిజన్ ఆడ్మిస్ట్రేషన్ పరిపాలన గాడి తప్పిందా అనే చర్చా పర్యావరణ ప్రేమికులో కొనసాగుతుంది. వన్యప్రానులు లెక్కలేని అని చనిపోతున్న వాటివైపు ఎందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు మౌనం పాటిస్తున్నారు. అనే విమర్శలు అధికంగా వినిపిస్తు న్నాయి. వన్యప్రాని అభయారణ్యం పరిధిలోని సిమెంట్ ప్యాక్టరి ఏర్పాడడంతో ఆ ప్రాంతం అంతా పర్యావరణం కలుషితం కావడంతో చివరకు పక్షిజాతికి ఎంతో ప్రసిద్ధిగాంచిన ప్రాంతం అంతా చివరకు గాడితప్పిన పాలనగా కొనసాగింది. ఇదంతా కేవలం నంద్యాల జిల్లా ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలోని రోళ్ళపాడు అభయారణ్యంలో బట్టమేకపక్షికి నిలయంగా ఉండే ప్రదేశం దేశంలోనే ఈ ప్రాంతం 2వ స్థానంలో నిలచింది. అటవీశాఖ అధికారులు బట్టమేక పక్షి సంరక్షణ చేసేందుకు లక్షల రూపాయాలు ఖర్చు చేస్తున్నారు. 2013-14 సంవత్సరం మద్యలో గడివేముల, బిలకలగూడూరు సమీపంలో ఓ సిమెంట్ ప్యాక్టరిని ప్రారంభించారు. ఈ ప్యాక్టరి సాయంకాలం విద్యుత్ కాంతులతో కనుచూపుమేర వెలుగుతునే ఉంటుంది.

## పట్టణంలో ఎంఎల్ఏ సుడిగాలి పర్యటన..!



**సుదీర్ఘ కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించేందుకు మంగళవారం పట్టణంలో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎథిక్స్ కమిటి చైర్మన్, శ్రీశైలం నియోజకవర్గం ఎంఎల్ఏ శిల్పా చక్రపాణిరెడ్డి పలు వార్డులలో సుడిగాలి పర్యటన చేపట్టారు.**

**ఆత్మకూరు డిసెంబర్19, ప్రభాతవార్త:**
పట్టణానికి చెందిన అల్తాప్ ముఫ్తి తండ్రి అల్లామాలిక్ ఇటివలే మరణించడంతో వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామార్శించారు. 6వ వార్డు ఇంచార్జీగా వైసిపి పార్టీలో మైనార్టీ నాయకుడు అహ్మద్‌రసూల్ ఆనారోగ్యంతో బాధపడుతుండడంతో వారి కుటుంబం దగ్గరకు వెళ్లి కుటుంబాని పరామార్శిం చారు. 16వ వార్డు పరిధిలో సచివాలయ కన్వీనర్ వెంకటరమణకు ఇటివలే కాలంలో రోడ్డు ప్రమాదం జరిగిన విషయాని దృష్టిలో ఉంచుకోని వారి కుటుంబాని పరామార్శించేందుకు ఇంటి దగ్గరకు వెళ్లి మెరుగైన వైద్యం కోసం రూ.15వేలు ఆర్థిక సహాయంను అందిం చారు. వీరితో పాటు పట్టణంలో పలు సమస్యలపైన సుడిగాలి పర్యటన చేపట్టారు. వీరి వెంటా పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, వరాల మాలిక్, కౌన్సిలర్ కలిముల్లా, 6వ వార్డు ఇంచార్జీ చేపల రఫిక్, తదితరులు పాల్గోన్నారు.

## ఏసిబి వలలో చిక్కిన నూతనపల్లె విఆర్ఓ విజయమ్మ

**కర్నూలు రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో నూతనపల్లె విఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న విజయమ్మ రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసిబి అధికారులకు పట్టుబడ్డారు.**



**కర్నూలు రూరల్,డిసెంబరు 19, ప్రభాతవార్త :**
ఏసిబి డిఎస్పీ ఎం వెంకటాద్రి తెలిపిన వివరాల మేరకు కర్నూలు రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో నూతనపల్లె విఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న ఎంసి విజయమ్మ పసుపుల గ్రామానికి చెందిన రైతు బొగ్గుల షేక్షావలి నుండి నూతనపల్లెలో పొలిమేరలో ఉన్న సర్వేనంబర్ 122లో తనకున్న 1ఎకరా5సెంట్ల భూమికి పట్టాదారు పాస్‌పుస్తకం మంజూరు చేసినందుకు రూ.10వేలు చెల్లించాలని రైతును డిమాండ్ చేసిందని ఏసిబి డిఎస్పీ వెంకటాద్రి తెలిపారు. సదరు రైతు ఏసిబి అధికారులను ఆశ్రయించడంతో మంగళవారం సాయంత్రం కర్నూలు రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఓ విజయమ్మను వలపన్ని పట్టుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏసిబి సిఐలు తేజేశ్వరరావు,ఎంవి కృష్ణారెడ్డి,వంశీనాథ్,సిబ్బంది పాల్గొన్నారు.

## పక్కరాష్ట్రాల పథకాలు కాపీ కొట్టి మోసం చేస్తున్న చంద్రబాబు

**- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి**



**ఆదోని రూరల్, డిసెంబరు 19,ప్రభాతవార్త :**
మాజీ సిఎం చంద్రబాబునాయుడు గతంలో 600హామీలతో ప్రజలను మోసం చేశారని ప్రస్తుతం ఆరు ఉచిత వాగ్దానాలను పక్కరాష్ట్రాల పథకాలు కాపీ కొట్టి అన్ని ఉచితమని ముఖ్యమంత్రి స్థానం కోసం మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని నియోజకవర్గ శాసనసభ్యులు వై సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హనవాలు గ్రామంలో రెండోరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సాయి గ్రామంలో ప్రతి ఇంటిని కలియ తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని నవరత్నాలు అమ్మఒడి,వైఎస్సార్ చేయూత,వైఎస్సార్ పెన్షన్ కానుక,రైతుభరోసా తదితర పథకాలు ప్రజలకు అందుతున్నాయా..లేదా అని తెలుసుకున్నారు. అలాగే మీకు మంచినీరు,వీధిదీపాలు,డ్రైనేజీ,రోడ్లు,ప్రజల ఆరోగ్యం తదితర సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికి రూ.3లక్షల వరకు లబ్ది చేకూర్చడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా హనవాలు గ్రామంలో రూ.16,50,89000లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు. జగనన్న కాలనీలో 93పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే జెసిబితో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30లక్షలతో మురికి కాలువలు,గ్రావెల్ రోడ్డు వేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌కు రూ.45లక్షలతో తరగతి గదులు నిర్మాణ దశలో ఉన్నాయని,రైతుభరోసా కేంద్రం రూ.20లక్షలతో నిర్మాణ దశలో ఉందన్నారు. రూ.79లక్షలతో జలజీవన్ యోజన పథకం ద్వారా తాగునీటి పైపలైన్ వేయాలని ఆదేశించారు. ప్రస్తుతం తెదేపా పరిస్థితి ఎలా ఉందంటే బాబుకు షూరిటీ పవన్‌కళ్యాణ్,భవిష్యత్తులో నిన్ను నమ్మరుబాబు,రాష్ట్ర ప్రజలు గ్యారెంటీ అన్నచందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి జగనన్న ప్రజలకు నేనున్నాననే భరోసా కల్పించారన్నారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్,సర్పంచ్ నారాయణప్ప,ఎంపిటిసి చాకలి ఈరన్న, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి రమేష్,మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వీరసేన లింగాయత్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల,పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రేణుకవైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీలక్ష్మి,మండల అధ్యక్షులు గురునాథ్‌రెడ్డి,వైసిపి సీనియర్ నాయకులు గోపాల, రావుస్వామి, చాకలి రాజా,గణేష్ స్వామి, యకోబ,గొల్ల మల్లికార్జున, కిష్టప్ప,లింగప్ప, రమేష్,గిరప్ప,నబీసాబ్,ప్రతాప్‌రెడ్డి,గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ రామలింగేశ్వర యాదవ్,మాజీ జడ్‌పిటిసి ఆనంద్,వెంకటేష్,కల్పవల్లి,చిన్న ఈరన్న, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులున్నారు.

## పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నాం

**- రవ్వలకొండ పై రూ.1.53కోట్లతో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు ప్రారంభించిన ఎమ్మెల్యే**
**- ఐదు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**బనగానపల్లె, డిసెంబర్19, ప్రభాతవార్త:**
బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండ వద్ద రూ.1.53 కోట్లతో జలజీవన్ మిషన్ నిధులతో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మంగళవారం ప్రారంభించారు. పట్టణంలోని 5వ గ్రామ సచివాలయం పరిధిలో గల రవ్వలకొండ మీద గడప గపడకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి జగనన్న అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ,వాలంటీర వ్యవస్థను తీసుకువచ్చారని ఆయన తెలిపారు.జగనన్న ప్రభుత్వంలో ప్రజల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు.అర్హత ఉన్న ప్రతి లబ్దిదారుడికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి సీసీ రోడ్లు,జలజీవన్ కింద ఇంటింటికి తాగునీరు, జగనన్న కాలనీలు, సచివాలయ భవనాలు,ఆసుపత్రుల అభివృద్ధి,రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నరన్నారు. నవరత్నాల పథకాల ద్వారా పేదల జీవితాల్లో మార్పు వచ్చిందని ప్రజలంతా సంతోషంగా ఉంటున్నరన్నారు. సంక్షేమ




పథకాలు ఇలాగే కొనసాగాలన్నా,రాష్ట్రం అభివృద్ధి చెందాలన్న మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజల పై ఉందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపిడివో శివరామయ్య,గ్రామీణ నీటిపారుదల డివిజనల్ ఇంజనీర్ ఉమాకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సాయికృష్ణ,గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారి ఖలీల్,ఈసారి ఎల్లయ్య, భానుముక్కల సహకార సంఘం చైర్మన్ నీలి శ్రీనివాసులు,వార్డుమెంబర్లు జీ.టీ.వెంకటరామిరెడ్డి, కుమ్మరి సురేష్‌బాబు,ఎంపిటిసి వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డి,గౌండా సుబ్బయ్య,గౌండా కంబగిరి, ముర్తుజా,సాబ్జాన్,బూత్ కమిటీ కన్వీనర్ అలీ అబ్బాస్,చిలకన్నగారి శ్రీరాములు,నాగరాజు,పెద్దన్న,గ్రామ సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టర్ సారు.. మేము బడికి ఎలా వెళ్ళాలి



**నందికొట్కూరు,డిసెంబర్ 19,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో మురికి నీరు రోడ్డెక్కి పారుతున్నాయని కలెక్టర్ సారు మేము బడికి ఎలా వెళ్ళాలని చిన్నారులు నిరుత్సాహ పడుతున్నారు. నెల రోజులుగా ఎస్సీ కాలనీలో కాలువలు నిండి మురికి నీరు రోడ్డుపైకి ఎక్కి పాతున్నాయని, దీంతో చిన్నారులు పాఠశాలలకు వెళ్ళాలన్న ఇబ్బందులు పడుతున్నారని కాలనీ వాసులు తెలిపారు. దీనిపై పంచాయితీ కార్యదర్శికి తెలిపిన పట్టించుకోలేదని, ఈ నెల 16వ తేదీ మండల అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకొని పోయిన స్పంధించడం లేదని తమ పిల్లలు అలాగే వృద్ధులు కూడ మురికి నీరు దాటి బయటికి వెళ్ళలేక పోతున్నారని స్తానికులు తెలిపారు. కావున ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు, స్తానిక అధికారులు స్పంధించి సమస్యను పరిష్కారించాలని కోరుతు జిల్లా కలెక్టర్‌కు సంతకాలు చేసిన పత్రాన్ని పంపినట్లుగా స్తానికులు తెలిపారు.

## తుమ్మలపెంటలో విషాదం

**- రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి**

**కొలిమిగుండ్ల,డిసెంబర్19,ప్రభాతవార్త:**
కొలిమిగుండ్ల మండలంలోని తుమ్మలపెంట గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.గ్రామానికి చెందిన సూర్య రామ్మూర్తి గౌడ్ కుమారుడు ఇంటర్ విద్యార్థి సూర్య రాజేష్ గౌడ్(16)రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఉదయం మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.పోలీసుల వివరాల మేరకు సూర్య రామ్మూర్తి గౌడ్ తుమ్మలపెంట సమీపంలోని జగనన్న కాలనీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటిని నిర్మాణం చేపడుతున్నారు. దీనికి సంబంధించి పని నిమిత్తం సూర్యరాజేష్ గౌడ్ తన తల్లి రమణమ్మతో కలిసి జగనన్న కాలనీకి వెళ్లి మోటర్ సైకిల్ పై తుమ్మలపెంట గ్రామంలోని ఇంటికి వెలుతుండగా ఎదురుగా వస్తున్న నాపరాళ్ల ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో రాజేష్‌గౌడ్ తీవ్ర గాయాలతో మృతి చెందగా తల్లి రమణమ్మ తీవ్రంగా గాయపడింది.చికిత్స నిమిత్తం ఈమెను తాడిపత్రికి తరలించి కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి వెల్లడించారు.



## అరటి పంట ధ్వంసం -లబోదిబోమంటున్న కౌలుదారుడు

**- 6 ఎకరాల అరటితోట ధ్వంసంతో రూ.40 లక్షలు నష్టం**
**- న్యాయం కోసం ఎస్పీకి ఫిర్యాదుచేస్తానంటున్న కౌలుదారుడు**

**బండిఆత్మకూరు,, డిసెంబరు 19, ప్రభాతవార్త:**
మండలంలోని కడమకాల్వ గ్రామంలో 6 ఎకరాల ఆరటితోట సాగుచేస్తున్న కౌలుదారుడు ఖాద్రీ రమణ గౌడ్ పొలాన్ని తిమ్మాపురం గ్రామానికి చెందిన భగ్గి వీరారెడ్డి తన అనుచరులతో పూర్తిగా ధ్వంసం చేసిన ఘటన మండలంలోని కడమలకాల్వ గ్రామంలో చోటుచేసుకుంది. 6 ఎకరాలు వేసిన ఆరటి పంట ధ్వంసం చేయడంతో చేతికి వచ్చిన పంట పూర్తిగా ధ్వంసం అయిందని రూ.40 లక్షలు నష్టం వాటిల్లిందని కౌలు రైతు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కౌలు రైతు రమణగౌడ్ మాట్లాడుతూ కడమలకాల్వ గ్రామంలో 6 ఎకరాల పొలాన్ని అబ్బిపురం గ్రామానికి చెందిన రామసుబ్బయ్య వద్ద 6 ఎకరాల పొలం ఏడాదికి రూ.2.70 లక్షల ప్రకారం మూడు సంవత్సరాల వరకు కౌలుకు తీసుకున్నానని తెలిపారు. రెండవ ఏడాది పొలం యజమాని రామసుబ్బయ్య తిమ్మాపురం గ్రామానికి చెందిన భగ్గి వీరారెడ్డి 3 ఎకరాలు, మేకల పావణిలకు 3 ఎకరాల పొలం అమ్మారని తెలిపారు. అమ్మేసమయంలో రమణ గౌడ్ మూడు సంవత్సరాలు కౌలుకు ఇచ్చానని గడువు పూర్తి అయ్యేవరకు పొలం వద్దకు వెళ్లరాదని తెలిపారని చెప్పారు. కానీ గత మూడు సంవత్సరాలు ఆరటి పంట పూర్తిగా నష్టం జరిగిందని అదనంగా మరో రెండు సంవత్సరాలు కౌలుకు కావాలని చెప్పడంతో వారు వినకపోవడంతో కోర్టును ఆశ్రయించానని కోర్టులో కేసు నడుస్తుందని



తెలిపారు. ఈసమయంలో భగ్గి వీరారెడ్డి తన అనుచరులు 30 మందితో పొలం వద్దకు వచ్చి కత్తులతో 6 ఎకరాల ఆరటి పంటను పూర్తిగా ధ్వంసం చేశారన్నారు. అదేసమయంలో తన కొడుకు పొలం వద్దకు మోటర్ వేయడానికి వెళ్లాడని ఆరటి తోటను నరకడం చూడడంతో వీరారెడ్డి అనుచరులు పొలంలో అడుగుపెడితే పీకకోస్తామని గట్టిగా కేకలు వేయడంతో భయపడి తనకు ఫోన్ చేశాడని నేను పొలం వద్దకు వెళ్లెసరిగా పూర్తిగా ధ్వంసం చేశారని తెలిపారు. గతంలో తమను చంపడానికి కరెంటు పెట్టారని తెలిపారు. విషయాన్ని బండిఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్లితే పోలీసులు పట్టించుకోవడం లేదని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలురైతు రమణగౌడ్ కుటుంబ సభ్యులు కోరారు.

# సిమెంట్ ప్యాక్టరితో.. పర్యావరణం అస్తవ్యస్తం..!

**(మొదటి పేజీ తరువాయి ) :** రోళ్ళపాడు అభయారణ యంకు 3కిలో మీటరుల దూరంలోనే ఈ ప్యాక్టరి ఉన్నట్లు అదికారులు అంచనవేసు కున్నట్లు సమాచారం. గతంలో ఆ అభయా ణ్యంలో బట్టమేక పక్షికి ఓ ప్రత్యేకత ఉండేది. పర్యటకులు ఈ ప్రాంతాని సందర్శించి బట్టమేక పక్షికోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వారు. గత రెండు సంవత్సరాల నుంచి బట్టమేక పక్షి రోళ్ళపాడు అభయారణ్యంలో కనుమరుగైంది. చివరిసారిగా ఆగష్టు 2020 సంవత్సరంలో ఒకసారి అటవీశాఖ అధికారుల గణంకాలలో కనిపించింది. దాదాపు మూడేళ్ళ నుంచి ఇక్కడ కనిపించడం లేదు. మొత్తం 614 హెక్టారులలో రోళ్ళపాడు అభయారణ్యం అటవీశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ అభయారణ్యంలో అడవి పందులు, జింకలు, దుప్పులు, ఇతర వన్య ప్రా నులు ఆవాస నిలయంగా ఈ ప్రాంతం నిలచింది. అయితే పర్యావరణం కలుషితమైందా బట్టమేక పక్షి ఎందుకు ఇటువైపు రావడం లేదు అనేది అటవీశాఖ అధికారులకు ప్రశ్నార్థకంగా మారింది. గత మూడు నెలల క్రితం అటవీశాఖలో విధులు నిర్వహిస్తున్న ఓ బృందం సంబందించిన సిమెంట్ ప్యాక్టరిలో కొందరు అధికారులను సంప్రదించగా పర్యావరణం వలన మా పక్షులకు వన్యప్రానులకు ఇబ్బందులు ఎదురువుతుండడంతో మీ ప్యాక్టరిని మూసివేసే విదంగా చొరవ తీసుకుంటామని చెప్పడంతో ఇద్దరు అధికారుల మద్యలో ఓ క్రింది స్థాయి ఉద్యోగి బేరసారాలు ఆడడంతో కరిదైన కారు బహుమతి అటవీశాఖకు ఇచ్చిన్నట్లు పర్యావరణ ప్రేమికులు ఆరోపిస్తున్నారు. మరో రేంజ్ స్థాయి అధికారికి ఓ రోడ్డు వేసే కాంట్రార్ మద్య లోనే పని ఆపడంతో అనుమతులు లేకుండా మా అటవీ మార్గంలో నువ్వు రోడ్డు ఎలా వేస్తావు అని చెప్పడంతో ఆ అధికారికి కరిదైన కారు బహుమతి ఇచ్చిన్నట్లు అటవీశాఖలోనే కొంత మంది ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

**గడిచిన రెండు సంవత్సరాలలో ఎన్నడులేని విదంగా వన్యప్రానుల మృత్యువాత..** అడ్మిన్ట్రేషన్ పరిపాలన విభాగంలో గాడితప్పిన పాలనగా మార దంతో గడిచిన రెండు సంవత్సరాలో ఎన్నడులేని విదంగా వన్యప్రానులు మృత్యువాత పడుతునే ఉన్నాయి. గత మూడు నెలల క్రితం ఇప్పటి వరకు మూడు పెద్దపులులు మృత్యువాత పడ్డాయి. నాలుగు పులి కూనలు ప్రత్యేక్షం కావడంతో తల్లిపులి ఆచూకి ఈనాటికి అటవీశాఖ అధికారులు గుర్తించలేకపోయారు. ఆత్మకూరు అటవీ డివిజన్ లో వన్యప్రానులు ఏదోఒక రూపంలో మృత్యువాత పడుతునే ఉన్నాయి. ఇప్పటి వరకు దుప్పులు, పులులు, చిరుత పులులు, ఇతర జాతులు వన్యప్రానులు ఎన్నో మృత్యువాత పడుతూ వచ్చాయి. అటవీశాఖ ఉన్నతాధికారులు ఇప్పటికైన స్పందించి రోళ్ళపాడు అభయారణ్యం పరిదిలో విద్యుత్ దీపాకాంతులతో వెలుగునిస్తున్న సిమెంట్ ప్యాక్టరిపై ఎలాంటి చర్యలు తీసుకుం టారో లేదో తెలియదు. అంతరించిపోతున్న పక్షిజాతిని కాపాడుకుంటారో వదిలి వేస్తారో అటవీశాఖ అధికారులకు నిజమెంతో అబద్దం ఎంతో వారికే తెలియాల్సి ఉంది.

**ఈ విషయంపై ఆత్మకూరు వన్యప్రాణి డిప్యూటి డైరెక్టర్ అలెన్‌చాంగ్ టేరాన్‌ను ప్రభాతవార్త ప్రతినిధి వివరణ కోరగా...** దేశంలో బట్టమేక పక్షికి నిలయంగా ఉన్న రా ష్ట్రాలు కొనే ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నల్లమల వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలోని రోళ్ళపాడు అభయారణ్యంలో గత మూడేళ్ళనుంచి భట్టమేకపక్షి ఎందుకు కనుమరుగైందని ప్రశ్నించగా మెయిన్ విద్యుత్ లైన్ ఈ ప్రాంతంలో వెల్లడంతో కరెంట్ తీగలు తగులుతూ ఉండడంతో బట్టమేక పక్షికి ఆవాసంగా ఉండలేక పోతుందని వివరించారు. కడప జిల్లాలో బట్టమేక పక్షి కనిపించిన్నట్లు అటవీశాఖ అధికారులు నా దృష్టికి తీసుకోని రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం రోళ్ళ పాడు అభయారణ్యంలో గత మూడు సంవత్సరాల నుంచి భట్టమేక పక్షి కోసం మేము ఎదురు చూస్తునే ఉన్నామని తెలిపారు. దేశంలో కర్నాటక, రాజస్థాన్, మహరాష్ట్ర రాష్ట్రాలలో బటమేక పక్షి ఉనికి అత్యదికంగా ఉందని వివరించారు. ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలో సిమెంట్ ప్యాక్టరి పర్యావరణం కాలుష్యం కావడంపైనే ఈ ప్రాంతంలో బట్టమేక పక్షి సంచరించడం లేదనే విమర్శలు వన్యప్రాని ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

## ఆళ్లగడ్డలో అంగన్‌వాడీ కార్యకర్తల వంటవార్పు

**ఆళ్లగడ్డ, డిసెంబరు 19, ప్రభాతవార్త:** అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు అధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు, అండ్ హెల్పర్ల యూనియన్ అద్వర యంలో 8వ రోజు సమ్మెలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీలు వంట చేస్తు తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు నాగరాజు, సిఐటియ నాయకులు బాల వెంకట్, రమేష్‌బాబులు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు సచివాలయ సిబ్బందితో పగలగొట్టించడం దుర్మార్గమైన చర్య అన్నారు. అంగన్‌వాడీ అక్కచెల్లెమ్మల ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి జగన్ వారి సమస్యలు పరిష్కరించేదిశగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లపై రాజకీయ జోక్యం ఉండరాదని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు రాజ్యలక్ష్మీ, పెద్దక్క, వేణమ్మ, నరసమ్మ, భారతీ, శశికళా, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం ధృవపత్రాల పై టీడీపీ కార్యకర్తలను నిలదీసిన కాలనీవాసులు

**బేతంచెర్ల, డిసెంబర్19, ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని డోన్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి తాను ఎమ్మెల్యేగా గెలిస్తే రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికి సెంటున్నర స్థలం ఇస్తామంటూ బేతంచెర్ల పట్టణంలో హామీ పత్రాలను పంపిణీ చేయడం జరిగింది. దీని పై మొదట్లో ఉత్సాహం చూపిన ప్రజలు ఇటీవల అసాధ్యంకాని హామీలు ఇవ్వడం టీడీపీకి పరిపాటిగా మారిందని వీటి పై స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలను నిలదీయాలని ఇటీవల ఆర్థిక మంత్రి బుగ్గన పిలుపునివ్వడం జరిగింది. దీంతో పలువురు నాయకులు, కాలనీవాసులు పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్‌నగర్, దుర్గాపేట, చాకలిపేట తదితర కాలనీల్లో టీడీపీ తరుపున హామీ పత్రాలను పంచిన నాయకులు, కార్యకర్తలను స్థలమే లేదుకదా ప్లాట్లు ఎలా ఇస్తారని నిలదీయడం జరిగింది. అయితే తమ నాయకుడు గెలిస్తే ఫ్లాట్లు ఖచ్చితంగా ఇస్తామని వారన్నారు. పలువురు వైసీపీ నాయకులు జోక్యం చేసుకుని ఆధార్‌కార్డుల ద్వారా ఓటీపీలు పంపి ఇలా ప్లాట్లు ఇస్తామని చెప్పడం ఏమిటని ఇది ప్రజలను మోసంచేయడం కదా అన్నారు. అయితే తాము ఖచ్చితంగా తమ అభ్యర్థి గెలిస్తే ఇచ్చిన హామీ పత్రం మేరకు ఒకటిన్నర సెంటు ఇంటి స్థలం ఇవ్వడం జరుగుతుందని పంపిణీ చేసేటప్పుడు నాయకులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారని వారిని ప్రజలు అడగలేదని స్వతహాగా సెల్‌నంబర్లు, రేషన్‌కార్డు నంబర్లు ఇవ్వడం వల్లనే వారికి ఓటీపీలు పంపి హామీ పత్రాలను ఇవ్వడం జరిగిందన్నారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

## తెదేపాలో పెరుగుతున్న ఆదరణ

**హొళగుంద, డిసెంబరు 19, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి రోజురోజుకు ప్రజాధారణ పెరుగుతుందని ఎండి హళ్లి సర్పంచ్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హెబ్బటం, లింగంపల్లి గ్రామాల్లో టిడిపి క్లస్టర్, ఇంచార్జ సుధాకర్ నేతృత్వంలో ఆయా గ్రామా ల్లో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెదేపా అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించే పథకాల గురించి తెలియపరిచి రిజిస్ట్రేషన్ నమోదు చేసి కరపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ సవరప్ప, మల్లికార్జున, లింగంపల్లి నాయకులు హనుమంతు రాయుడు, శేషన్న, భూతి ఇంచార్జ్‌లు, భీమా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 10వతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

**పగిడ్యాల, డిశంబరు 19, ప్రభాతవార్త :** స్థానిక జెడ్పీపాఠశాలలో సోమవారం 2023-24 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించే 10వతరగతి విద్యార్థులకు 2024 మార్చి 18నుండి 27వరకుపబ్లిక్ పరీక్షలు జరుగుతుండటంతో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మధుసూధనరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్గించారు. కాలవ్యవదితక్కువగా ఉన్నందున విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్దంగా సబ్జెక్టులవారిగా అవగానచేసుకుని ఏకాగ్రతో ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాలనీ అన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టల వారిగా విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ పదవ తరగతి మోడల్ పేపర్ ఆవిష్కరణ

**ఆదోని రూరల్, డిసెంబరు 19, ప్రభాతవార్త :** యుటిఎఫ్ ఆద్వర్యంలో ప్రచురించిన పదవ తరగతి మోడల్ పేపర్‌ను మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నందు డిప్యూటీ విద్యాధికారి వెంకటరమణారెడ్డి, మండల విద్యాధికారులు శివరాములు, శ్రీనివాసులు ఆవిష్కరించారు. 2024మార్చిలో జరగబోయే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి యుటిఎఫ్ ప్రచురణాల విభాగం మోడల్ పేపర్‌ను ప్రచురించింది. ఈ సందర్బంగా జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప మాట్లాడుతూ గత 25సం။లుగా విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని తక్కువ ధరతో పుస్తకాలను ముద్రిస్తున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థులు కనీసం మార్కులు సాధించడానికి ఈ మోడల్ పేపర్లు ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వినర్ శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున, రామాంజనేయులు, నాయకులు జగన్‌మోహన్‌రావు, రుద్రముని, మల్లికార్జున, శివకుమార్‌గౌడ్, భోజరాజు, రాముడు, జనార్థన్, రంగనా యకులు, నాగేష్, కృష్ణుడు, ఉరుకుందయ్య, వెంకటరమణ, హనుమంతు, జయప్రద తదితరులున్నారు.

## పైప్‌లైన్ మార్పు..బండగట్టు నీటి సరఫరా బంద్

**దేవనకొండ, డిసెంబరు 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నెల్లిబండ గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో ప్లాట్లు వేయడంతో ఆ పొలంలో వెళ్లిన బండగట్టు మంచినీటి సరఫరా పైప్‌లైన్ మార్పు నిర్మాణ పనులు మంగళవారం చేపట్టడంతో పలు గ్రామాలకు మంచినీటి సరఫరా బంద్ కానుంది. దీంతో మండలంలోని దేవనకొండ, వరిముక్కల, అలారుదిన్నె, కరివేముల, కప్పట్రాళ్ల, గద్దెరాళ్ల, వెలమకూరు గ్రామాలకు మంచినీటి సరఫరా సంబంధిత శాఖాధికారులు బంద్ చేయనున్నారు. 4రోజుల పాటు ఆయా గ్రామాల ప్రజలకు మంచినీటి అవస్థలు తప్పవు, పైప్‌లైన్ మార్పు నిర్మాణ పనులు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండానే కిందిస్థాయి అధికారుల ప్రమేయంతోనే కొనసాగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్ ఉన్నతాధికారులు మంచినీటి ఎద్దడి తలెత్తకుండ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయంపై సంబం ధిత బండగ ట్టు మంచినీటి సరఫరా పర్యవేక్షణ అధికారి, పత్తికొండ సబ్ డివిజన్ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విష్ణును ప్రశ్నించగా అధికారుల అనుమతితోనే పైప్‌లైన్ మార్పుకు అయ్యే ఖర్చు పొలం యజ మాని పెట్టుకోవడం జరుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ ఆదేశాల మేరకు ఆ పనులు చేపట్టినట్లు తెలిపారు.

## సిమెంట్ ప్యాక్టరితో..పర్యావరణం అస్తవ్యస్తం...!

**(మొదటి పేజీ తరువాయి ) :** ఎంత కష్టాపడ్డారో తమకంటే అప్పటి కార్పొరేటర్లకు అధికారులకు బాగ తెలుసన్నారు. ఇక కరోనా సమయంలో కర్నూలుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు నిత్యావసర సరుకులు అందించడంతో పాటు ప్రభుత్వాసుపత్రికి అక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు అందించి కర్నూలు ప్రజల కోసం కోట్లాది రూపాయల విలువచేసే ఐపోద్రావణాన్ని ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. తమపై విమర్శలు చేసేవాళ్లు ఆపార్టీ అధినేత కుటుంబంలో ఉన్న పరిస్థితి తెలుసుకొని మాట్లాడాలన్నారు. కర్నూలు ప్రజలు మంచి చేయడమే తప్పా ఏనాడు కీడు చేయనిది తమ కుటుంబం అన్నారు. తమ గుర్తించి వ్యక్తిగత విమర్శలు చేసే ముందు నిజనిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఊహించనివిధంగా అభివృద్ధి చేస్తానన్నారు. జోహరాపురం యువత వైసీపీని వీడి టిడిపిలో చేరడం సంతోషమని యువకులు సరైన నిర్ణయం తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు తిమ్మాజీ, మోహన్, వెంకటయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, ఎల్లాగౌడ్, చంద్రమోహన్, వినోద్, చౌదరి, శాంతమ్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ ఆదాచేసి భావితరాలకు భరోసానిద్దాం

**పత్తికొండ, డిసెంబర్19, ప్రభాతవార్త:** ప్రస్తుత కాలంలో కరెంట్‌ను ఆదాచేసి భావితరాలకు భరోసానిద్దామని విద్యుత్ ఏడీ ఖాజా హుస్సేన్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం పత్తికొండ పట్టణంలో కర్నూలు రోడ్డులో ఉన్న ఆర్ఆర్ స్కూల్ ఆవరణంలో విద్యుత్ వినియోగదారులకు ఇంధన పొదుపు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఎవరు సమయంలో ఏసీలను ఆఫ్ చేయాలని, ఏసీ ఆన్‌చేసిన సమయంలో బయటి నుండి వేడి రాకుండా చూసుకోవాలని, ఏసీ కొంతసేపు పనిచేయకపోతే ఫ్యాన్‌తో గదిని చల్లగా ఉంచుకోవాలన్నారు. అలాగే ఇంట్లో ఎవరులేని సమయంలో లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేసుకోవాలన్నారు. గ్రైండర్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు, ఇంటిల్లో జాగ్రత్తగా వాడుకోని కరెంట్‌ను పొదుపు చేయాలని ఆయన సూచించారు. విద్యుత్ పొదుపు సామాజిక బాధ్యత అని ఆయన అన్నారు. ఒకట్రెండు జతలకు వాషింగ్‌మెషిన్ వాడకూడదన్నారు. ఎలక్ట్రిక్ వస్తువులు వాడిన తరువాత వెంటనే వాటి ఆఫ్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ నారాయణస్వామి నాయక్, కాంట్రాక్ట్ శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనదపు కట్నము కేసుల్లో నిందితుని జైలు శిక్ష

**కోవెలకుంట్ల, డిశంబరు 198, ప్రభాతవార్త :** అదనపు కట్నము కేసులు కోవెలకుంట్ల పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వడ్డెమంగలినాగరాజు(కొపుగాడు)కు కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జర్జి షేక్ అబ్దుల్ రహమాన్ జైలు శిక్ష విదించారు. వివరాలోకి వెల్లితే కోవెలకుంట్ల పట్టణంలోని వడ్డె మంగలి నాగరాజు(కొపుగదాడు)పై 2020సంవత్సరములో కేసు నెంబరు 66కింద 498(ఎ) కేసు నమోదు కావడము జరిగిందని యస్ఐ వెంకటరెడ్డి చెప్పారు. ఈకేసులు మూడు సంవత్సరాల పాటు సుదీర్గ వాదనలు విన్న కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జర్జి షేక్ అబ్దుల్ రహమాన్ మంగళవాము తుది తీర్పును ప్రకటించారు. అరు నెలల జైలు శిక్షతో పాటు రూ 1000జరిమానాను విదిస్తు తీర్పు వెల్లడించారు. కోర్టు అదేశాల ప్రకారము ముద్దాయిని కడప జెంట్రల్ జైలుకు తరిలించారు.

## ఈవీఎంలో ఓటు వినియోగించుకోవడం పై అవగాహన

**బేతంచెర్ల, డిసెంబర్19, ప్రభాతవార్త:** సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈవీఎంలో ఓటును ఎలా వినియోగించుకోవాలో ప్రజలకు ట్రైనర్ దేవదాస్, వీఆర్వో గోవిందప్పలు మంగళవారం అవగాహన కల్పించారు. పట్టణంలోని సబ్‌రిజి స్ట్రార్ ఆఫీస్ దగ్గర, నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి ఆధ్వర్యంలో, హనుమాన్‌నగర్‌లో ఈవీఎం మిషన్‌ను ఉంచి ఓటును ఎలా వినియోగించుకోవాలో తాము అనుకున్న అభ్యర్థికి ఓటు ఎలా వేయాలో ఓటర్లకు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓటర్లు, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ ంది పాల్గొన్నారు.

## షాదిఖానా మరమ్మతు పనులను వేగవంతం చేయండి - నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

**బేతంచెర్ల, డిసెంబర్19, ప్రభాతవార్త:** పట్టణంలోని షాదిఖానా మరమ్మతు పనులను వేగవంతం చేయాలని నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలంరెడ్డి మంగళవారం గుత్తేదారుడికి సూచించారు. పనులను పరిశీలించిన చైర్మన్ నాణ్యతతో కూడిన పనులను చేయాలని అలాగే షాదిఖానా చుట్టు డ్రైనేజీ కాలువలు, రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఆయనతోపాటు ఫ్లాట్ల దస్తగిరి, కాంట్రాక్టర్ ఖాదర్, వైసీపీ సోషల్‌మీడియా ప్రతినిధి రామనాయుడు, అధికారులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల భిక్షాటన



**చాగలమర్రి, డిసెంబర్19, ప్రభాతవార్త:** తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐటీయుసీ నాయకురాల్లు చంద్రకళ, వహీదా, ఇందుమతి, సీఐటీయు నాయకురాల్లు పద్మావతి, వసంత, నాగమణి, వై.పద్మావతిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు మంగళవారం భిక్షాటన చేపట్టారు. నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఇందుకు నిరసనగా అంగన్‌వాడీ కార్యకర్తలు జోలెపట్టి బజారంబడి భిక్షాటనచేస్తూ పలు కాలనీల్లో తిరిగి నిరసన చేపట్టారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలంగాణ కంటే అదనంగా వేతనం ఇచ్చి ఆదుకుంటామని జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. నాలుగున్నర సంవత్సరాలు పూర్తి కావస్తున్నా తమ సమస్యలను పరిష్కరించకుండా తమ పై చిన్నచూపు చూస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య బద్దంగా పీటమెక్కిన ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్యన్ని ఖూనీ చూస్తూ భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా స్వేచ్ఛయుత కాలరాస్తూ తమ పై దౌర్జన్యాలకు తిరగడం అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టి సచివాలయ సిబ్బందితో అంగన్‌వాడీ బాధ్యతలను నిర్వహింపజేయడం హేయమైన చర్య అని వారు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించుకుంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పాల్గొన్నారు. వివిధ ప్రజా సంఘాల మద్దతు : గత ఏడు రోజులుగా అంగన్‌వాడీ కార్యకరలు స్థానిక కేరళ ఆసుపత్రి ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద చేస్తున్న నిరాహార దీక్షలకు తెలుగుదేశం పార్టీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు పలికారు.

## అంగన్వాడీ వర్కర్లకు జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేయాలి

**వెల్దుర్తి, డిసెంబరు 19, ప్రభాతవార్త:** అంగన్వాడీ వర్కర్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేయాలని అదేవిధంగా వారి డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమోదించాలని వెల్దుర్తి మండల అధ్యక్షులు టి బలరాం గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలో దీక్షలు చేపట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలకు సంఘీభావం తెలుపుతూ వారికి రూ.5 వేలు ఆర్థికసాయం మండల అధ్యక్షులు అందజేశారు. గత ఏడు రోజులుగా అంగన్‌వాడీలు చేస్తున్న నిరసనకు మద్దతుగా బలరాం గౌడ్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 15 శాతం వేతనాలు పెంచితే ఈవైకాపా హాయంలో కేవలం 9 శాతం పెంచి వారిని తీవ్రంగా మోసగించారన్నారు. అదేవిధంగా ఇచ్చిన ఒక్క హామిని కూడ ముఖ్యమంత్రి నేరవేర్చడంలో విఫలమయ్యారని తెలిపారు. అంగన్‌వాడీలకు పనిభారం రెండితలు పెంచారు. వేతనాలు మాత్రం పెంచలేదన్నారు. అంగన్‌వాడీలు శాంతియుతంగా నిరసన తెలిపితే వారిపై అక్రమ కేసులు పెట్టడం, వారిని బెదిరించి భయాందోళనలకు గురిచేయడం, అంగన్వాడి కేంద్రాల తలుపులు బద్దలు కొట్టడం హేయమైన చర్య అని ఇదెం అన్యాయమని అవేదన వ్యక్తం చేశారు. అనంతరం అంగన్‌వాడీకి కార్యకర్తలకు భరోసానిస్తు రాబోయే టిడిపి అధికారం చేపట్టడం తధ్యమని అప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం చేసేందుకు మా నాయకుడు నారా చంద్రబాబు హామి ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే అంగన్‌వాడీ చేస్తున్న రిలేనిరాహారదీక్షలకు రూ.5 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల యువ నాయకులు బొమ్మన రమాకాంత్‌రెడ్డి, రామళ్లకోట అచారి, గుంటుపల్లి వెంకటరాముడు, రామచంద్రనాయుడు, బజార్, గోపాల్‌గౌడ్, మెకానిక్ నారాయణ, హోటల్ శ్రీను, ముల్లా బషీర్, ఐటిడిపి సూరి, ప్రసాద్, చందు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నూతన కమిటీ ఎన్నిక

**నంద్యాల హాస్పటల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక నంద్యాల జిల్లా కార్యాలయంలో నంద్యాల పట్టణ కార్యవర్గ సమావేశం పట్టణ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అధ్యక్షతన జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు ఆకుమల్ల రహిమ్, మహిళా విభాగం కన్వీనర్ ప్రసన్నకుమారి హాజరుకావడం జరిగింది. ఈకార్యక్రమాన్ని దేశం ప్రేమించుమన్న-మంచి అన్నది పెంచుమన్న అన్న దేశభక్తి గీతంతో పట్టణ ప్రధాన కార్యదర్శి శివశంకర్ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక యొక్క పరిచయం చేయడం జరిగింది. జిల్లా అధ్యక్షులు రహిమ్ ఐక్యవేదిక పనిచేస్తున్న అంశాలు, భారతరాజ్యాంగం కనీస అవగాహన సమాచార హక్కు చట్టం, గ్రామ సభలు, లోప భూఇష్ట ఎన్నికల విధానాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తు ప్రజలను చైతన్యపరిస్తు పనిచేస్తుందని తెలిపారు. మంచిభావజాలం కలిగి సమాజహితం కోరే ప్రతి వ్యక్తి మా ఐక్యవేదికలో సభ్యతం తీసుకొని భవిష్యత్తు తరాలకు మెరుగైన ఉత్తమ సమాజనిర్మాణానికి పునాదులు వేయడానికి ముందుకు రావాలని కోరారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రజాస్వామ్య పద్దతిలో ఎన్నిక చేయడం జరిగింది. మహిళా విభాగం కన్వీనర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఐక్యవేదిక లక్ష్యాల సాధనకు మహిళలను కూడ భాగస్వామ్యం చేస్తు మహిళా విభాగంలో నంద్యాల పట్టణ మహిళా విభాగ కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈసందర్బంగా నంద్యాల పట్టణ అధ్యక్షులుగా భీష్మ, ప్రధానకార్యదర్శిగా శివశంకర్, కోశాధికారిగా ఇక్బాల్, ఉపాధ్యక్షులుగా వాసుదేవ, మదార్‌వలి, సహాయ కార్యదర్శిగా మహేశ్వరాచారి, రసూల్, సభ్యులుగా కరాటే మహబూబ్‌బాష, నని రసూల్, ఉశేన్‌బాషలను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, సభ్యులు రహంతుల్లా, అబ్దుల్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు సమ్మెలో భాగంగా వంట వార్పు

**నందికొట్కూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** తమ సమస్యలు పరిష్కారించాలని అంగన్వాడీలు గత ఎనిమిది రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా ఐ.సి.డి.యస్. కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ మరియు హెల్పర్స్ వంట వార్పుప కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి గోపాలక్రిష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వర్‌రావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు పి.మదార్‌బీ మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కారించకుండా అణిచివేత ధోరణి అవలంబిస్తున్నదని, ఎనిమిది రోజులుగా అంగన్వాడీ కేంద్రాలు మూతపడిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, న్యాయ సమ్మతమైన కనీస వేతనం రూ.26వేలు, గ్రాట్యుటి ఇతర సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తున్నామని అయితే ప్రభుత్వం నుండి స్పందన లేదని అంగన్వాడీల కోర్కెలు తీర్చేంత వరకు సమ్మె అపేదిలేదని, వై.యస్.జగన్‌మోహన్‌రెడ్డి గద్దె ఎక్కేంత వరకు అక్కచెల్లమ్మల సమస్యలు పరిష్కారిస్తానని పదవి చేపట్టగానే అణిచివేతకు గురి చేస్తున్నాడని, అంగన్వాడీ కేంద్రాల తాళాలను ధ్వంసం చేయించి సచివాలయాలకు స్వాధీనం చేశారని అయిన ఎక్కడ కేంద్రాలు పని చేయడంలేదని వారు తెలిపారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి వెంటనే హామలు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ మరియు ఆయాలు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ పేపర్ ఆవిష్కరణ

**ఆదోనిలీగల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రచురించిన పదో తరగతి మోడల్ పేపర్‌ను మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, ఎంఈఓలు బి.శివరాములు, పి.శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2024 మార్చిలో జరబోయే పదో తరగతి పరీక్షలకు సంబంధించి యూటీఎఫ్ ప్రచురణాల విభాగం మోడల్ పేపర్‌ను ప్రచురించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్బంగా జిల్లా కార్యదర్శి టి.గాదిలింగప్ప మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరతో పుస్తకాలను ముద్రిస్తున్ననరన్నారు. వీటిని ఉపాధ్యాయులు, విద్యార్థులు దరించాలన్నారు. వెనకబడిన విద్యార్థులు కనీసం మార్కులు సాధించడానికి ఈ మోడల్ పేపర్‌లు ఉపయోగంగా ఉంటాయన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ జి.శ్రీనివాసులు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున, వై.రామాంజనేయులు, యూటీఎఫ్ నాయకులు జగన్‌మోహన్‌రావు, రుద్రముని, మల్లికార్జున, శివకుమార్‌గౌడ్, భోజరాజు, రాముడు, జనార్ధన్, రంగనాయకులు, నగేష్, కృష్ణుడు, ఉరుకుందయ్య, వెంకటరమణ, హనుమంతు, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

## 10వతరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

**పగిడ్యాల, డిశంబరు 19, ప్రభాతవార్త :** స్థానిక జెడ్పీపాఠశాలలో సోమవారం 2023-24 విద్యాసంవత్సరానికి గాను నిర్వహించే 10వతరగతి విద్యార్థులకు 2024 మార్చి 18నుండి 27వరకుపబ్లిక్ పరీక్షలు జరుగుతుండటంతో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.మధుసూధనరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్గించారు. కాలవ్యవదితక్కువగా ఉన్నందున విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్దంగా సబ్జెక్టులవారిగా అవగానచేసుకుని ఏకాగ్రతో ప్రశాంతమైన వాతావరణంలో చదువుకోవాలనీ అన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టలవారిగా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండలంలోని మూడు పాఠశాలకు ట్యాబులు పంపిణీ

**పగిడ్యాల, డిశంబరు 19, ప్రభాతవార్త :** పగిడ్యాల మండలంలోని మూడు పాఠశాలలకు 8వతరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులు అయా పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులకు అందజేశామనీమండల విద్యాశాఖాధికారి పి.సుభాన్, మండల విద్యాశాఖాధికారి -2, మురళీమోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పగిడ్యాల జెడ్పీపాఠశాలకు 53ట్యాబులు, అంబేద్కర్ గురుకులబాలికలపాఠశాలకు 80ట్యాబులు, ముచ్చుమర్రి జెడ్పీపాఠశాలకు 34 ట్యాబులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేయడం జరిగిందన్నారు. 21వతేదీన రాష్ట్రముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జన్మదినం పురష్కక్కరించుకుని ఆయాపాఠశాలల ప్రధానోపధ్యాయులు 8వతరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబులు అందజేస్తారన్నారు. 316ట్యాబులు రావలసివుందనీ రాగానే విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందనీ మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్ తెలిపారు.

## 23న ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేస్తాం..

**:- 24గంటలు రోడ్డు దిగ్బంధం:- అఖిలపక్ష నేతలు వెల్లడి**

**తుగ్గలి, డిసెంబరు 19, ప్రభాతవార్త :** తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ ఈ నెల 23న మండల కేంద్రమైన తుగ్గలిలో ఉండే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసి మంత్రాలయం-బెంగళూరు, గుంతకల్-తుగ్గలి రహదారులను 24గంటలు రోడ్డును దిగ్బంధం చేస్తున్నట్లు అఖీలపక్ష నాయకులు మంగళవారం వెల్లడించారు. తుగ్గలిలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాజీ జడ్‌పి కోఆప్షన్ సభ్యులు నబీరసూల్, టిడిపి మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు, సిపిఐ మండల కార్యదర్శి సుల్తాన్, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు, బిజెపి మండల అధ్యక్షులు లక్ష్మణస్వామిలు మాట్లాడుతూ తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ గత నెల నుండి అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని మండిపడ్డారు. అందువల్ల ఈ నెల 23న మండల కేంద్రమైన తుగ్గలిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు వేసి రోడ్లపై వంట-వార్పు చేసి, 24గంటలు రోడ్డు దిగ్బంధం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల రైతులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## రాష్ట్ర అభివృద్ధి వైసిపితోనే సాధ్యం..!

**హొళగుంద, డిసెంబరు 19, ప్రభాతవార్త :** రాష్ట్ర అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ఆలూరు వైసిపి ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి, యువనేత గుమ్మనూరు ఈశ్వర్‌లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన హొళగుందలో తోక వెంకటేష్ వివాహ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైకాపా పాలనలో రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతిఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో తోక వెంకటేష్, మండల కన్వీనర్ షఫీవుల్లా, శ్రీ సిద్దేశ్వర ఆలయ ధర్మకర్త రాజాపంపన్నగౌడ్‌ఎంపిపి తనయుడు ఈసా, సింగిల్‌విండో చైర్మన్ మేలిగిరి మల్లికార్జున, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బావ కురువ శేషప్ప, హనుమప్ప, రాము, జొండె సిద్దయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మోకాళ్ళపై నిలబడి అంగన్‌వాడిల నిరసన

**మంత్రాలయం, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడిలు చేస్తున్న నిరసన కార్యక్రమం మంగళవారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. మంత్రాయలంలో అంగన్‌వాడి కార్యకర్తలు మోకాళ్ళపై నిలబడి, చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా సిఐటియు మండల కార్యదర్శి జయరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. రూ.26,000వేతనం ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. అలాగే మండలంలోని రాజకీయ ఒత్తిళ్ళ వలన కొన్ని అంగన్‌వాడి కేంద్రాలను ఓపన్‌చేసి అంగన్‌వాడిలు విధులు నిర్వహించడం చాలా బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఒత్తిళ్ళకు గురిచేసినా సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాణేష్, అంజి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు విశాలాక్షి, భీమేశ్వరి, ఉమామహేశ్వరి, ప్రమీల, హనుమంతమ్మ, ద్రాక్షాయణి, కళ్యాణి, రంగమ్మ, లక్ష్మి, మరియమ్మ, సుందరమ్మ, సరిత, మేరీ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజుపై సమావేశం

**ఆదోనిలీగల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** ఆదోని డిపోలో ఓఎస్-15కు సంబంధించి ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అవగాహన సదస్సును మంగళవారం స్థానిక డిపో సమావేశ భవనంలో నిర్వహించారు. ఓఎస్-15 సదస్సును కర్నూలు డీపీటీవో టీవీ రామం, కర్నూలు డిప్యూటీ సీటీఎం వారి అధ్యక్షతన డిప్యూటీ ఈఈ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో 20 మంది వ్యాపారవేత్తలు పాల్గొన్నారు. యువతీ యువకులు, నిరుద్యోగులు, వివిధ వ్యాపారులు వారివారి వ్యక్తిగత వ్యాపారం రీత్యా టెండర్లలో పాల్గొని జీవనోపాధిని పొందాలని సూచించారు. ఆర్టీసీ డిపో పరిధిలోని ఖాళీ స్థలాలను 15 యేళ్ల పాటు లీజుకు ఇస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్టీసీ ఎండీ రఫిక్, ఎస్టీవి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు గూడూరు నుంచి చనుగొండ్ల వరకు బిజెపి పాదయాత్ర



**గూడూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** గూడూరు నుంచి చనుగొండ్ల గ్రామం వరకు గుంతల మయంగా మారిన రోడ్డు పరిస్థితిపై బిజెపి పార్టీ బుధవారం పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కోడుమూరు నియోజకవర్గ బిజెపి ఇన్‌చార్జు ప్రేమకుమార్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ నియోజకవర్గం నుంచి ప్రతి ఐదేళ్లకు ఒక సారి ఎమ్మెల్యేలు మారుతున్నా నియోజకవర్గ కేంద్రం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న చనుగొండ్ల గ్రామానికి అనువైన రోడ్డును వేయలేక పోవడం సిగ్గుచేటన్నారు. అంతే గాక ఈ మార్గాన అధికార పార్టీ నేతలు, మంత్రులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులంతా తిరిగినా ఈ రోడ్డు గురించి పట్టించుకోలేక పోయ్యారని ఆయన ఎద్దవా చేశారు. అంతే గాక చనుగొండ్ల గ్రామ ప్రజలు అధ్వానంగా మారిన రోడ్డును బాగు చేయాలని అనేక సార్లు పాలకుల దృష్టికి తీసుకువచ్చిన సందర్బాలు ఉన్నాయన్నారు. అయినా ఈ రోడ్డుపై ఏ ఒక్కరూ స్పందించి రోడ్డు బాగుకు ఎలాంటి చర్యలు తీసుకోలేక పోయ్యారని ఆరోపించారు. అందుకే ఈ రోడ్డుపై తమ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర ద్వారా ఇక్కడి పాలకులకు కనువిప్పుచేసేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని బిజెపి నాయకులు ప్రేమకుమార్ స్పష్టం చేశారు.

## అంగన్‌వాడీల వంటావార్పు



**మిడుతూరు, డిసెంబర్19, ప్రభాతవార్త:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. రోజురోజుకు ఆందోళన తీవ్ర రూపం దాల్చుతూ వంటావార్పు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి.సుబ్బమ్మ, జి.లక్ష్మీకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి పి.పక్కీరి సాహెబ్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎనిమిది రోజుల నుంచి శాంతియుతంగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగనన్‌ఆడీలపై కక్ష్య సాధింపు చర్యలు చేపడుతున్నారని వారు విమర్శించారు. సమస్యలు పరిష్కరించకపోగా సచివాలయం సిబ్బంది, ఇతర సిబ్బంది పెట్టి గర్భిణులు, బాలింతలకు, చిన్నపిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేయాలని చెప్పడం సరైనది కాదన్నారు. అంగన్‌వాడీలు రేపు సచివాలయ సిబ్బంది కూడా ఇదే గతి పడుతుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి వివిధ పథకాలకు బటన్ నొక్కుతున్నారు తప్పా అంగన్‌వాడీ సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు వెంకటశివుడు, జి.లింగస్వామి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగమధు, డి.శేషమ్మ, కేజీయ రాణి, పుల్లమ్మ, మంగమ్మ, హుసేనమ్మ, శైలజ, ఉమాదేవి, భువనేశ్వరి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

## నాల్గవ మద్యం దుఖాణం ఏర్పాటుకు అధికారుల ఏర్పాట్లు



**కోడుమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం దగ్గర ఎక్సైజ్ అధికారులు నాల్గవ మద్యం దుఖాణాన్ని ఏర్పాటు చేసేందుకు ఎక్సైజ్ అధికారులు సిద్దమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆ ప్రాంత కాలనీ వాసులు అడ్డుకునేందుకు ముందుకువచ్చారు. ఈ మేరకు ఇది వరకే స్థానిక తాహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కాలనీ వాసులు మద్యం దుఖాణాన్ని ఏర్పాటుకు అనుమతి ఇవ్వరాదని కోరుతూ అధికారులకు వినతి పత్రంను అందజేశారు. మంగళవారం మద్యం షాపు ఏర్పాటుకు సేకరించిన స్థలాన్ని పరిశీలించేందుకు ఎక్సైజ్ సి.ఐ గౌరీ ప్రియతో పాటు,స్థానిక పోలీసులు అంతా ఇక్కడకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆ కాలనీ వాసులంతా అక్కడికి చేరుకొని ఈ ప్రాంతంలో మద్యం దుఖాణంను ఏర్పాటు చేస్తే సహించేది లేదని హెచ్చారించారు. నిత్యం ఈ మార్గంలో విద్యార్థులు,ఆసుపత్రికి వెళ్లే రోగులు,కూలీ నాలీ చేసుకొని జీవనం చేసుకునే మహిళలు ఇక్కడ తిరుగుతారని ఇలాంటి ప్రదేశంలో మద్యం దుఖాణాన్ని ఏర్పాటు చేయడం సమంజసం కాదని ఇక్కడకు వచ్చిన ఎక్సైజ్ అధికారికి మొరపెట్టుకున్నారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైకాపా అధికారం చేపట్టిన వెంటనే దశల వారిగా మద్యం దుఖాణాలను ఎత్తివేస్తానని హామి ఇచ్చి ఆ హామీని తొంగలోకి తొక్కారని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులకంటే వైకాపా ప్రభుత్వానికి ఆదాయమే ముఖ్యమని తెలుస్తోందన్నారు. అధికారంలోకి రాగానే మీరిచ్చిన ఆ హామీ ఎక్కడ అమలు చేశావాన్నా ఓ జగనన్నా అంటూ కాలనీ మహిళలు అమీనాబీ, సరోజమ్మ,లక్ష్మీదేవిలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలు మరచి నిత్యం మహిళలు సంచరించే ప్రాంతాలల్లో మద్యం దుఖాణాలను ఏర్పాటు చేయడం మీకూ.. న్యా యంగా ఉందా... అన్నా .. అంటూ మహిళలు వాపోయ్యారు. ఈ ప్రాంతంలో ఎట్టి పరిస్థి తుల్లో మద్యం దుఖాణాన్ని ఏర్పాటు చేయనీయమన్నారు. అనంతరం ప్రజల తిరుగుబాటుపై అక్కడికి వచ్చిన ఎక్సైజ్ అధికారులు,స్థానిక పోలీసులు వెనుతిరిగి వెళ్లి పోయ్యారు.

## వైసీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కమిటీ సెక్రెటరీగా కార్ రవికుమార్



**నంద్యాల హాస్పటల్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** నంద్యాల పట్టణం దేవ నగర్‌కు చెందిన రవికుమార్‌ను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రిస్టి యన్ మైనార్టీ సెల్ కమిటీ సెక్రెటరీ గా నియమించారు. ఆయన ఈసందర్భంగా మాట్లాడుతూ మాజీ మంత్రి, పెద్దలు శిల్పా మోహన్‌రెడ్డి, వారి తనయుడు నంద్యాల శాసన సభ్యులు శిల్పా రవిచంద్రకి శోర్‌రెడ్డి ఆశీస్సులతో నాకు ఈ పదవి దక్కడం చాల ఆనందంగా ఉందన్నారు. ఈసందర్భం గా కార్ రవికుమార్‌ను నంద్యాల డయాసిస్ సిఎస్ఐ సంఘ సభ్యులు ఘనంగా సన్మానించా రు. ఈకార్యక్రమంలో డయాసిస్ సెక్రెటరీ జడ్ స్టాన్లీ, డా.ఎంఎస్‌సి మనోజ్‌కుమార్, ఇంజర్ల ప్రేమ్‌కుమార్, కామిరెడ్డి చర్చిల్, దేవనగర్ బాష, ఇమ్మానియేల్, మోహన్‌బాబు, మద్దయ్య, మోహన్‌రావు తదితరులు ఆయనను సన్మానించారు.

## 20ఏళ్ల కల నెరవేరబోతోంది..

:- జొన్నగిరి వైసిపి నాయకులు సుంకన్న,దివాకర్



**తుగ్గలి, డిసెంబరు 19,ప్రభాతవార్త :** మండల పరిధిలోని జొన్నగిరి గ్రా మంలో ఎస్‌సి కాలనీలో రోడ్డు నిర్మా ణం సైడు కాలువలు లేక 20ఏళ్లుగా మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెద జల్లుతుందన్నారు. ప్రజలు, వాహనదారులు అటుగా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడే వారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ సహకారంతో సిసిరోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతో ఏళ్ల తరబడి ప్రజలు ఎదురు చూస్తున్న నిరీక్షణ నెరవేరబోతోందని ఆ గ్రామ వైసిపి నాయకులు సుంకప్ప,దివాకర్‌లు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ జొన్నగిరిలో పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌సి కాలనీవాసులు గ్రామస్తులు చెరువుకట్ట నుండి పగిడిరాయి వెళ్లేందుకు గ్రామంలో సిమెంటు రోడ్డు నిర్మాణం,సిమెంటు రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ కాలువలను ఏర్పాటు చేయాలని రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వివరించడం జరిగిందన్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే శ్రీదేవమ్మ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీదేవమ్మ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీదేవమ్మ గ్రామంలో 20ఏళ్లుగా ఉన్న రోడ్డు సమస్య పరిష్కరించడంతో ఎస్‌సి కాలనీ వాసులు,గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి,పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ గెలుపునకు మరింత కష్టపడి పనిచేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మురళీ,ఆంజనేయులు,చిన్న అంజి,రామన్న,ఆనందు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల బిక్షాటన..

:-కడుపు చేత పట్టి వచ్చాం..మీరైనా కనికరించండి..



**కోసిగి, డిసెంబరు 19, ప్రభాతవార్త :** అయ్యా మీరైనా కనికరించి మాకు బిక్షం వేయండి.. మా కడుపులు చేత పట్టి వచ్చాం మాపై దయ చూపండి అంటూ అంగన్ వాడీలు వీధుల్లో బిక్షాటన చేపట్టి అందరికి దేహి అంటూ అడుక్కున్నారు.. గత 8 రోజులుగా చేస్తున్న సమ్మెకు సంబంధించి ప్రభుత్వం నుండి ఏలాంటి స్పందన రాకపోవడంతో మంగళవారం కోసిగిలోని అంగన్‌వాడీ వర్కర్లు వీధుల్లో, అంగళ్లల్లో బిక్షం ఎత్తుకున్నారు.. సిఐటియు నాయకులు రాముడు, వీరేష్, హెప్సి బారాణి, లూసమ్మ, వరలక్ష్మిల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు బిక్షాటన చేసి ప్రభుత్వ నిరంకుశ వైఖరిపై విరుచుకుపడ్డారు.. అనంతరం రాముడు వీరేష్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లుకు పని భారానికి తగ్గ వేతనం చెల్లించడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైందని, దీనిని ప్రశ్నిస్తే, వ్యతిరేకిస్తే అణిచివేయటం సరైన విధానం కాదన్నారు..ముఖ్యంగా రాష్ట్రానికి రాష్ట్ర ప్రభులకు పెద్ద దిక్కుగా ఉండవలసిన ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీ వర్కర్ల చేస్తున్న న్యాయమైన నిరసనకు సానుకూలంగా స్పందించి న్యాయం చేయాలన్నారు.. అనంతరం ర్యాలీగా వచ్చి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాను నిర్వహించారు..ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ యువగళంతో జగన్‌కు వణుకు పట్టింది

:-టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి



**మంత్రాలయం, డిసెంబర్ 19,ప్రభాతవార్త:** టిడిపి అధినేత చంద్రబాబు తనయుడు,మాజీమంత్రి నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్రతో ముఖ్యమంత్రి జగన్‌కు వెన్నులో వణుకు పుట్టిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.మంగళవారం పాదయాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసినభారీ బహిరంగ సభలో పాల్గొనేందుకు టిడిపి కార్యకర్తలు,నాయకులతో కలిసి బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువనేత లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర విజయవంతం కావడంతో విశాఖపట్నం,తగరపువలస,పోలిపల్లిలో నేడు మధ్యాహ్నం జరుగుతున్న యువగళం-నవశకం భారీ బహిరంగ సభకు టిడిపి ఇంచార్జ్ తిక్కారెడ్డి ఆధ్వర్యంలో క్లస్టర్,యూనిట్ ఇంచార్జ్‌లు,ముఖ్య నాయకులు,కార్యకర్తలతో బయలుదేరి వెళ్ళారు.

## వంటవార్పుకార్యక్రమం చేపట్టి నిరసనతెలిపిన అంగన్వాడివర్కర్స్అండ్ హెల్పర్స్



**పగిడ్యాల, డిశంబరు 19,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్ప్యయూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించాలనీ, నెలకు కనీసవేతనం రూ. 26,000లు ఇవ్వలనీ, సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు గ్రాట్యూటి ఇవ్వలనీ, రిటైర్డు అనంతరంరూ.5,00,000లు ఇవ్వాలనీ న్యాయమైన డిమాండ్స్‌తో నిరసన దీక్షలు 8రోజులుగా చేస్తున్నా పట్టించుకోకపోవడంతో వంటావార్పు కార్యక్రమం చేపట్టినట్లు యూనియన్ నాయకురాలు కుర్షిద్‌బీ, సాజిదాబేగం, రాములమ్మలు హెచ్చరించారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ ఎదుట నిరసన దీక్షల్లో పాల్గొన్న అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చేపట్టిన కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్మోహనరెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాహీలను అమలు పరచవలసిన ఆయన దాదాపు ఐదు సంవత్సరాలు కావచ్చినావిఫలంచెందారన్నారు. ఐదు యాప్‌లలో నాలుగింటిని రద్దుచేసి ఒక్కయాప్ పెట్టాలనీ, అంగన్వాడీ కేంద్రాలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలనీ కేంద్రాలను మౌళికసదుపాయాలు కల్పించాలనీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నెత్తినోరు పెట్టికొని మొత్తుకున్నా రాష్ట్రముఖ్యమంత్రి పట్టించుకున్న పాపానపోలేదన్నారు. న్యాయంగా వారిడిమాండ్స్‌ను అమలు చేయకుండా తాస్కారం చేయడం అంతమంచిదికాదన్నారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు కుర్షిద్‌బీ, సాజిదాబేగం, రాములమ్మలు మాట్లాడుతూ సమ్మెనోటీస్ ఇచ్చినఅనంతరం సమ్మెచేపట్టామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకువేసిన తాళాలు పగటగొట్టడం అన్యాయమన్నారు. గొంతమ్మకొర్కెలు తాముకోరడం లేదనీన్యాయమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలనీలేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వం దిగివచ్చేవరకు నిరసన కార్యక్రమాలు విరమించేదిలేదనీ, అవసరమైతే నిరహారదీక్షలు చేపట్టేందుకు వెనకడుగువేసేప్రశక్తిలేదనీ వారుహెచ్చరించారు. వంటావార్పుచేపట్టిన కార్యక్రమంలో ఆయా ఆరుణకుమారి కూతురు చిన్నారి రక్షిత పాల్గొనడం విశేషం.వంటావార్పు కార్య క్రమ అనంతరం తహల్దార్ కార్యాలయం వద్ద అందరు బందిగా కూర్చోని భోజనం చేసి 5గంటల అనంతరం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఇంటికి వెళ్లిపోయారు.

## భూరీసర్వే రైతులకు శాపంగా మారిందా..!



**హొళగుంద, డిసెంబరు 19,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం మండలంలో చేపడుతున్న భూ రీసర్వే పేదప్రజలు,రైతులకు శాపంగా మారిందని రైతుసంఘం నాయకులు తప్పెట రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల రైతులు తహశీల్దార్ కార్యాలయాన్ని చుట్టుముట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ భూములకు పట్టాలు కలిగి వున్నా రీసర్వేలో మాత్రం తమ భూములు పట్టాలో కలిగి ఉన్న విస్తీర్ణం కంటే ఆన్‌లైన్‌లో తక్కువ చూపుతుందని అలాగే మిగులు భూమి కింద చూపిస్తుందన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన భూరీసర్వే పథకం అధికారుల చర్యల కారణంగా తప్పుతడకలుగా మారుతూ గోల్‌మాల్‌కు ఆసరాగా నిలిచిందని ఆయా గ్రామాల రైతులు మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూరీసర్వే ద్వారా సాగులో ఉన్న రైతులకు పక్కాగా పత్రాలు పొందుపరిచి వారి భూమి హక్కు సమర్పించాలని ఈ పథకం ప్రారంభించారన్నారు. అయితే భూ రీసర్వే వల్ల రైతులు,పేదప్రజలకు అన్యాయం జరుగుతుందని రైతుసంఘం నాయకులు,రైతులు,మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ముద్దటమాగి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి 44/సి2లో 2.74ఎకరాలు ఉండగా ఆన్‌లైన్‌లో మాత్రం 45సెంట్లు మరియు 45సెంట్లు చూపుతుందని మిగతా 1ఎకరా39సెంట్లు ఎక్కడుందని ప్రశ్నించారు. కావున దయచేసి భూరీసర్వేను అధికారులు సక్రమంగా చేపట్టాలని రైతులు,మండల ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు,మండల ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతన్నలు తదితరులున్నారు.

## గద్దెరాళ్ల మారెమ్మ ఆలయ ట్రస్ట్ ఏర్పాటు

**దేవనకొండ, డిసెంబరు 19,ప్రభాతవార్త :** మండలంలో ప్రసిద్ది చెందిన గద్దెరాళ్ల మారెమ్మ అవ్వ దేవాలయానికి ట్రస్ట్ కమిటీ ఏర్పాటుకు దేవాదాయ శాఖ నుండి ఉత్తర్వులు మంజూరు కావడంతో గద్దెరాళ్ల గ్రామస్తులు ఆ నోటిఫికేషన్ రద్దు చేయా లని కోరుతున్నారు. మంగళవారం గ్రామస్తులు విలేకర్లతో మాట్లాడుతూ 2013 నుండి దేవాదాయ శాఖ పరిధిలో మారె మ్మ దేవాలయం విలీనం చేశామని అప్పటి నుండి దేవాలయ ఆయకట్టుదారులు,పూజారులు,గ్రామస్తులు,రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో రెండేళ్లకు ఒకసారి వచ్చే మారెమ్మ దేవర ఉత్స వాలను ప్రశాంతంగా జరుపుకుంటున్నట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. ప్రస్తుతం ఆలయ కమిటీ ఏర్పాటు చేయాలని నోటిఫికేషన్ జారీ చేయడం సబబు కాదన్నారు. దేవాదాయ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని మండల తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కి వినతిపత్రం అందించినట్లు ఆ గ్రామస్తులు తెలిపారు. నోటిఫికేషన్ రద్దు చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## వంటావార్పుతో నిరసన తెలిపిన అంగన్‌వాడీలు..!



**ఆలూరు, డిసెంబరు 19,ప్రభాతవార్త :** అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపి అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వంట వార్పుతో నిరసన తెలియజేశారు. మంగళవారం సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు వినూత్నంగా వంట వార్పు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపి అంగన్‌వాడి వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ తాలుక కార్యదర్శి జయశ్రీ,సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి నారాయణస్వామిలు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు జగన్‌మోహన్‌రెడ్డి తెలంగాణలో కంటే ఎక్కువ వేతనాలు పెంచుతానని, ఉద్యోగ భద్రత,అర్హులకు ప్రమోషన్లు,రిటైర్మెంట్ బెనిఫిట్స్,పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని మాటిచ్చి మరిచారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఐసిడిఎస్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలన్నారు. అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా సామాజిక కార్యకర్త మద్దతు తెలిపారు. సిఐటియు తాలుక నాయకులు కృష్ణ,ఏపి అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి,లీలావతమ్మ,సరోజమ్మ,బాలరంగమ్మ,లక్ష్మీ,సరస్వతీ,సుజాత,ప్రభావతి,పుష్పావతి,వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

## నిరుద్యోగుల వయో పరిమితి 44సం॥లకు పెంచాలి



**ఆదోని రూరల్, డిసెంబరు 19,ప్రభాతవార్త :** నిరుద్యోగుల వయో పరిమితి 44సంవత్సరాలకు పెంచాలని యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మారుతిరావు,నియోజకవర్గ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్,పార్టీ ఇంచార్జ్ నీలకంఠప్ప,మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దిలీప్‌దోకలు అన్నారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలనాధికారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెగా డిఎస్సీ ద్వారా 50వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల భర్తీకి నిరుద్యోగులకు వయో పరిమితి 42ఏళ్ల నుంచి 44ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. చాలా ఏళ్ల నుండి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో నిరుద్యోగుల వయో పరిమితి మించిపోయి శాశ్వత నిరుద్యోగులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువకులు ఆందోళనలు చేసిన ఫలితంగా నేడు రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1,2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందని కానీ ప్రస్తుతం నిరుద్యోగుల వయో పరిమితి 42ఏళ్ల మాత్రమే ఉందని దీని ద్వారా లక్షలాది మంది నిరుద్యోగులు నష్టపోయే అవకాశం ఉందని కావున ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరుద్యోగులు బలికాకుండ వయోపరిమితి 44ఏళ్లకు పెంచాలన్నారు. అలాగే ఇంజనీరింగ్ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం కేవలం రాజకీయాల లబ్ది కోసం నేడు నిరుద్యోగులకు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా మినీ గ్రూప్-1,2 నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయినాథ్, సుంకన్న,మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం - ఆర్డీవో



**చాగలమర్రి, డిసెంబర్19,ప్రభాతవార్త:** హైవే రహదారికి సంబంధించి నేషనల్ హైవే 440వ జాయతీ రహదారి విస్తర్ణకు భూములు కోల్పోయిన రైతులకు తగు పరిహారం అందించి న్యాయం చేస్తామని నంద్యాల ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు.మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో హైవే రహదారి విస్తర్ణలో భూములు కోల్పోయిన రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే 440 రహదారి కడప జిల్లా వేంపల్లె నుంచి మల్లివేముల,చాగలమర్రి 44వ జాతీయ రహదారికి కలుపుతుండడం వల్ల మల్లివేముల గ్రామానికి సంబంధించి 74 మంది రైతులకు చెందిన భూమి 24 ఎకరాలు,చాగలమర్రి గ్రామానికి చెందిన 23 మంది రైతులకు సంబంధించి 3 ఎకరాలు ఈ రహదారిలో రైతుల భూములు కోల్పోతుందన్నారు. ఈ భూములకు ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం రైతుల వద్ద నుండి ఆ పొలాలకు సంబంధించిన దస్తావేజులు,పాస్‌బుక్‌లు,ఈసీ,1బి అండగల్,బ్యాంకు అకౌంట్,ఆధార్‌కార్డు,పాన్‌కార్డు నఖాళ్లను సేకరించారు. అనంతరం రైతులు జగదీశ్వరెడ్డి,మల్లారెడ్డి,మాజీ జెడ్పీటీసీ రామసుబ్బయ్య తదితరులు మాట్లాడుతూ తాము సాగుచేసుకుంటున్న భూములు ఎంతో విలువైనవని,రోడ్డు విస్తర్ణలో భాగంగా చాలా విలువైన భూములను కోల్పోతున్నామని ప్రభుత్వం తమకు ఇచ్చే పరిహారం కూడా ప్రభుత్వ మార్కెట్ ధర కాకుండా ఇక్కడ జరిగే మార్కెట్ విలువను బట్టి రైతులకు పరిహారం అందించాల్సిందిగా వారు ఆర్డీవోను కోరారు. తమకు గిట్టుబాటు ధర నిర్ణయిస్తేనే తమ భూములను ఇచ్చేందుకు అంగీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్లు విజయ్‌కుమార్,ఉసేన్,శ్రీనివాసరెడ్డి,మండల సర్వేయర్లు,వీఆర్వోలు ,సచివాలయ వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలు వంట వార్పు



**కొత్తపల్లి, డిసెంబర్ 19,ప్రభాతవార్త:** నిరవధిక సమ్మెలో భాగంగా ఎనిమిదవ రోజు అంగన్వాడీ వర్కర్లు రెవెన్యూ కార్యాలయం వద్ద వంట వార్పు నిర్వహించారు. మంగళవారం ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసు రత్నం పాల్గొని మాట్లాడుతు నిరవధిక సమ్మె కొన సాగుతున్న ప్రభుత్వం స్పందించడంలేదని, పైగా కేంద్రాల తాళాలను ధ్వంసం చేయడం ధుర్మార్గమైన చర్య అని ఆయన విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ అందరు ఒకే మాటపై ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడాలని మేము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో రవణమ్మ, నాగమణి, పద్మావతి, శ్యామలమ్మ,అచ్చమ్మ దాదాపు 80 మంది పాల్గొన్నారు.

## తేదేపాతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం - బీసీ ఇందిరారెడ్డి



**బనగానపల్లెరూరల్, డిసెంబర్19, ప్రభాతవార్త:** తేదేపాతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగడంతోపాటు ప్రతిఒక్కరికి ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్‌రెడ్డి సతీమణి,రాష్ట్ర థాయ్‌బాక్సింగ్ చైర్‌పర్సన్ బీసీ ఇందిరారెడ్డి పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని 8వ వార్డులో గల శివరామ్‌టాకీస్,ఆంజనేయస్వామిగుడి ఏరియాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం బీసీ ఇందిరారెడ్డి ఆధ్వర్యంలో శ్రీవిష్ణు ఫౌండేషన్ అధినేత కొణిదెల పుల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ముందుగా బీసీ ఇందిరారెడ్డి అక్కడికి చేరుకోగానే కొణిదెల పుల్లారెడ్డి,వారి కుటుంబ సభ్యులు బాణసంచా పేల్చి పూలమాలతో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం బీసీ ఇందిరారెడ్డి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఇటీవలే తేదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమం కొరకు ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ వాటి ప్రయోజనాలను తెలియజేశారు.అదే విధంగా ఈ ఆరు గ్యారెంటీ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.1.22లక్షలు లబ్ది చేకూరనున్నట్లు ఆమె వివరించారు.ఈ సందర్భంగా బీసీ ఇందిరారెడ్డి మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాగైనా అధికారం చేపట్టాలనే ఉద్దేశంతో ప్రజలకు అనేకమైన అమలుకాని హామీలను ఇచ్చి నేడు అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరించడం జరిగిందన్నారు.ఈ వైకాపా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎవరు కూడా సంతోషంగా లేరని ఈ సందర్భంగా తెలిపారు. చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరగడంతోపాటు ప్రతిఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని కావునా రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అలాగే బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్‌రెడ్డిని, గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్,టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య,టీడీపీ పట్టణ అధ్యక్షులు దూదేకుల ఖాసీంబాబు,బనగానపల్లె నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు రాయలసీమ సలాం,టిప్‌టాప్ కలాం,వెల్‌కం ఫోటోస్టూడియో అల్తాఫ్,లాయర్ నాగేంద్రారెడ్డి,యనకండ్ల ఖాదర్,మాజీ ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి మురళీమోహన్‌రెడ్డి,టీడీపీ నాయకులు,కార్యకర్తలు,మహిళలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శ్రీ నరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు



**బనగానపల్లెరూరల్, డిసెంబర్19,ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణశివార్లలో గల రవ్వలకొండ పై వెలసిన శ్రీశ్రీశ్రీ చెంచులక్ష్మిసమేత పావన నరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని శ్రీ స్వామివారికి వేకువజాము నుంచి సూర్యోదయం లోపలే తులసిదళాలతో అర్చనలు,ప్రత్యేక పూజలు, అభిషేకాలు,కుంకుమార్చనలు ఆలయ వ్యవస్థాపకులు,ఆలయ ప్రధాన అర్చకులు బాలిశెట్టి పావననరసింహమూర్తి మంగళవారం తెలిపారు.ఈ కార్యక్రమాలను 16వ తేది నుంచి నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.స్వామివారి సేవలో పాల్గొనేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి కుంకుమార్చనలు,అభిషేకాలు,ప్రత్యేక పూజలను నిర్వహించి వారి భక్తిని చాటుకోవడం జరుగుతుందన్నారు.అదే విధంగా శ్రీస్వామివారి ఆశీస్సులు భక్తుల పై ఉండాలని ఆయన అన్నారు.ఈ సందర్భంగా బాలిశెట్టి పావన నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎంతో మంది దాతలు వారి సహకారాలను అందజేయడం జరిగిందని మన ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచేకాకుండా సుదూర ప్రాంతాలైన తెలంగాణ,కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటూ వారికి తోచిన సహాయ సహకారాలను అందజేయడం హర్షించదగ్గ విషయమని ఆయన తెలిపారు.అదే విధంగా ఆలయ అభివృద్ధి రోజు రోజుకు ముందుకు పోవడం జరుగుతుందన్నారు.ఆలయ అభివృద్ధికి సహకరించిన భక్తులకు అలాగే శ్రీ స్వామివారిని దర్శించుకుని పూజలను నిర్వహించేందుకు వచ్చిన భక్తుల పై శ్రీస్వామివారి కృపకటాక్షలు ఎల్లవేళల ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



**చాగలమర్రి, డిసెంబర్19,ప్రభాతవార్త:** స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యా లయంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు సర్పంచ్ తులశమ్మ మంగళవారం దు స్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భం గా ఇన్‌చార్జ్ ఈవో కె.నాగమణి మాట్లా డుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా గ్రామ పంచాయతీలో పనిచేసే ముగ్గురు పర్మినెంట్ కార్మికులకు మూడు జతలు మరియు 33 మంది కాంట్రాక్ట్ కార్మికులకు రెండు జతల దుస్తులను అందజేశామన్నారు.అలాగే అందరికి ఒక జత చెప్పులు కూడా అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్లా,పంచాయతీ సిబ్బంది రూబెన్,సుబ్బమ్మ,దేవదాస్,షేక్షావలి,ఓబులేసు,తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పశువుల దాణా పంపిణీ

**బనగానపల్లె, డిసెంబర్19,ప్రభాతవార్త:** పాడి రైతులు పశువుల దాణాను సద్వినియోగం చేసుకోని పాల ఉత్పత్తిని పెంచాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గోవింద్‌నాయక్ సూచించారు.మంగళవారం బనగానపల్లె మండలానికి మంజూరైన 20 టన్నుల టీఎంఆర్ దాణాను పాడి రైతులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గోవిందనాయక్ మాట్లాడుతూ వ్యవసాయంతోపాటు రైతులు పాడి పోషణలో రాణించాలన్నారు.ప్రస్తుతం పశువులకు వ్యాధులు సంక్రమించడం వల్ల పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు.పశువులకు దాణా పెట్టడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు.అలాగే గొర్రెలు,మేకల,పొట్టేళ్లకు దాణా అందించడం వల్ల మాంసపుకృత్తులు పెరుగుతాయన్నారు.అదే విధంగా ప్రభుత్వం పశువులకు హెల్త్‌కార్డులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బనగానపల్లె పశువైద్యశాల సహాయసంచాలకులు డాక్టర్ మారుతి సకారం,కోవెలకుంట్ల పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.వి.బ్రహ్మం,పశువైద్యులు రామ్‌కుమార్‌రెడ్డి,లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఖురేసా తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు బార్‌అసోషియేషన్ సంఘీబావము



**కోవెలకుంట్ల, డిశంబరు 19,ప్రభాతవార్త :** అంగన్‌వాడీల సమస్యలసాధన కోసం గత వారము రోజులుగా రిలే దీక్ష చేస్తున్న విషయం విదితమే అందులో బాగంగా కోవెలకుంట్ల రెవెను ్యకార్యాయలంలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు కోవెలకుంట ్ల బార్ అసోషియేషన్ సీయర్ లాయర్లు జియల్ నరసింహులు, శ్రీనివాసులు చంద్రదు, రమేష్,సిపియం నాయకుల సుదాకరులు మద్దత్తు ప్రకటించారు. ఈసందర్భముగా లాయరు నరసింహులు మాట్లాడుతూ అంగన్‌వాడీల కోర్కెలు న్యాయమైనవని వారి కోర్కెలు తీర్చడము ప్రభుత్వంపై ఉందని చెప్పారు.,అలాగ కాకుండా అంగన్ వాడీ సెంటర్లను వాఇలంటరీలు,ఐక్య సంఘం సభ్ ్యలు సచివాలయ సిబ్బందితొ నడిపించడము జరి అయిన పద్దత్తి కాదన్నారు. చాలా చోట్ల సెంటర్ల తాళలు పగుట గొట్టడము హేయమైన చర ్యఅన్నారు. ఈ పద్దత్తి ప్రభుత్వం స్వప్తి చెప్పాలాని అయన డిమాండు చేశారు.


IN THE COURT OF THE HON'BLE III ADDL.DISTRICT JUDGE CUM II ADDL. M.S.J CUM PRL. FAMILY COURT. MEDCHAL MALKAJGIRI DISTRICT : :: AT :: PRASHANTHNAGAR, KUKATPALLY.

F .C.O.P.No.679 OF 2021

BETWEEN:
**Smt. G. Rosy Leena,** ...Petitioner
AND
**Mr. D.V.S. Pratap Babu** ...Respondent

To,
**Mr. D.V.S. Pratap Babu**
S/o. Venkata Kondaih,
R/o. H.No.71/144-A-1, Atmakur Bus Stand, Nandyal, Kurnool Dist., Andhra Pradesh. **...Respondent.**

Please take notice in the above FCOP, that the above named petitioner filed F.C.O.P.No.679 of 2021, for divorce and subsequently the Hon'ble court ordered notices through paper publication and posted the matter on **03.01.2024** for your appearance before the Hon'ble III Addl. District Judge-cum-II Addl. M.S.J-cum-Prl. Family court, Medchal Malkajgiri District, at kukatpally at about 10.30 AM in person or through advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Hon'ble Court)
**Sd/ R. RAMA PADMAJA**
**Advocate**
**Counsel for the petitioner**
#No.3-8/105, 301 III Floor, Rajiv Gandhi, Opp: HDFC Bank, Bachupally, Hyderabad.
**Cell No.9966622077.**

## పాత్రికేయున్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే బుడ్డా



**బండిఆత్మకూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త:** బండి ఆత్మ కూరు మండలంలో సీనియర్ పాత్రికేయుడిగా పనిచేస్తున్న నాగరాజు భార్య కొన్ని రోజుల క్రిందట పెద్దదేవులాపురం వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. శివమాల ధరించి ఉండ డంతో రాలేకపోయినందున మంగళవారం పాత్రికేయున్ని స్వస్థలం బోదనం గ్రామానికి వెళ్లి పాత్రికేయున్ని కుటుంబాన్ని పరామర్శించి ఇద్దరి కూతుళ్ళ చదువులు నేను చూసుకుంటానని మీ కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో శ్రీశైలం తెలుగుయువత అధ్యక్షులు బొల్లవరం మల్లేశ్వర్‌రెడ్డి, మండల అధ్యక్షులు నరసిం హారెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, సర్పంచ్ యలగల రామచంద్రుడు, ఉప సర్పంచ్ లింగారెడ్డి, డిష్ రామలింగం, బాలయ్య, మౌలాలి, శివ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తు చర్యలు

:- డీఎస్పీ పి శ్రీనివాసరెడ్డి



**హొళగుంద, డిసెంబరు 19, ప్రభాతవార్త :** 2024ఎన్నికల్లో భాగంగా ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తు భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ పి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తాత్కాలిక తనిఖీలో భాగంగా ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక పోలీస్‌స్టేషన్‌ను టెక్నాలజీ పరంగా స్టేషన్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే ఎన్నికల నిర్వహణ కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేకంగా కానిస్టేబుల్‌లను ఏర్పాటు చేసి గస్తీని పెంచామన్నారు. అలాగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సమస్యాత్మక గ్రామాలను ఎంపిక చేసి అక్కడ ముందస్తుగా బైండోవర్ కేసులు ఉన్నా, రౌడీషీటర్లకు గ్రామాలలో అవాంతరాలు ఏర్పరచకుండ అవగాహనను కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణ ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరు తమకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే గ్రామాల్లో పలు పోలింగ్ బూత్‌లను ఎస్ఐ శ్రీనివాసులు ఆద్వర్యంలో పర్యటించి అక్కడ ఏర్పాటు చేయాల్సిన పలుకార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నామన్నారు. బందోబస్తుతో పాటు భద్రత ఏర్పాట్లను సైతం ముందస్తుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ కేసులు అప్రమత్తంగా ఉండాలని అదేశించిన వైద్యాధికారులు



**కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 19, ప్రభాతవార్త:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వివిధ విభాగాల హెచ్ఓడిస్‌తో ఆరోగ్యశ్రీ మరియు ఈ హాస్పటల్స్‌ప సమీక్ష నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి వెంకట రంగారెడ్డి తెలిపారు. అన్నివిభాగాలకు సంబంధించిన ఈహాస్పటల్ క్లినికల్ మార్క్‌డిల్ 90 శాతం బాగచేశారని తెలిపారు. కోవిడ్ కేసులు ఇతర రాష్ట్రాల్లో పెరుగుతున్న నేపద్యంలో మంగళవారం పల్మనాలజి, పిడియాట్రిక్, మెడిసిన్ విభాగాలకు సంబంధించిన హెచ్ఓడిలతో సమీక్ష నిర్వహించిన అనంతరం వైద్య సిబ్బందికి అదేశాలు జారీచేశారు. పలు విభాగాలలో బయోమెడికల్ ఎక్విప్‌మెంట్ పరిశీలించి సైరిక్స్ సిబ్బందితో క్రిటికల్ ఎక్విప్‌మెంట్‌లను పరిశీలించి అనంతరం వాటికి రిపేరుచేసి సిద్దం చేయాలని ఇంకా ఎక్విప్‌మెంట్ ఏమైనా ఉంటే తద్వారా పూర్తిచేయాలని సంబంధించిన సైనిక్ సిబ్బందికి అదేశించారు. ఈకార్యక్రమానికి కర్నూలు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్, ఆసుపత్రి డిప్యూటి సూపరింటెండెంట్ డా.ప్రభాకర్‌రెడ్డి, వైద్యకళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, సిఎస్ఆర్ ఎంఒ డా.వెంకటేశ్వర్‌రావు, డా.హేమనలిని, హెచ్ఓడిస్ డా.శ్రీనివాసులు, డా.సీతారామయ్య, డా.శ్రీలక్ష్మీబాయి, డా.రాధరాణి, డా.విజయఆనంద్‌బాబు, ఆర్ఎంఒ డా.వెంకట రమణ, డా.శివబాల నాగాంజన్, డా.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## మెగా క్రికెట్ టోర్నమెంట్ స్థలం పరిశీలన - శిల్పా కార్తీక్‌రెడ్డి

**ఆత్మకూరు డిసెంబర్19, ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం నియోజకవర్గంలో క్రీడలో ఉత్సహంగా ఆటలు ఆడే యువతకు అన్ని విదాలుగా మౌళిక సదుపాయాలు కల్పిస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో ముందుకు వెళ్తూ త్వరలోనే జరగబోయే మెగా నియోజకవర్గ క్రికెట్ టోర్నమెంట్ స్థలాని పరిశీలన చేసేందుకు నియోజకవర్గ వైసిపి యువ నాయకుడు శిల్పా కార్తీక్‌రెడ్డి మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ క్రీడా మైదానం ప్రాంగాణంను సందర్శించారు. ముందుగా పార్టీ కార్యాలయంలో పలు ప్రజా సమస్యలపై పలువురును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలో క్రీడాకరులో దాగి ఉన్న నైపుణ్యం వెలికి తీసేందుకు ప్రతి సంవత్సరం క్రికెట్ టోర్నమెంట్‌ను జనవరి నెలలో ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపధ్యంలోనే మరోసారి నియోజకవర్గం లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు శిల్పా కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు ప్రణాళిక సిద్దం చేసుకుంటున్నారు. ఈ క్రీడలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే విదంగా ప్రత్యేక చొరవ శిల్పా కార్తీక్‌రెడ్డి తీసుకుంటున్నారు. వీరి వెంటా మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్లు కురుపాటి విజయ్‌చౌదరి, 9వ వార్డు కౌన్సిలరు సుల్తాన్, మ్యాజిక్ బస్సు రఫిక్, వైసిపి పట్టణ యువ నాయకులు ఎన్ఎస్ రషీదు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, పీఈటిలు తదితరులు పాల్గొన్నారు.

# ఆడుదాం ఆంధ్ర టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తిచేయాలి

-జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్



**నంద్యాల, డిసెంబరు 19, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు సంబంధించి అన్ని మండలాలు, మున్సిపాలిటిల్లో టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పర్తిచేసి నివేదికలను సమర్పించాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని విడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అన్నిమండలాల ఎంపీడిఓలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. జేసి టి రాహుల్‌కుమార్‌రెడ్డి, జడ్పీ సిఈఓ సుబ్బారెడ్డి, జిల్లా క్రీడాప్రాధికార అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న నేపధ్యంలో పోటీల నిర్వహణకు మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు ప్రత్యేక శ్రద్ధతీసుకొని నిర్వహించాలని అదేశించారు. అన్ని మండలాల, మున్సిపాలిటిల టీమ్‌ల ఫార్మేషన్ తక్షణమే పూర్తిచేసి నివేదికలు సమర్పించాలన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన అర్గనైజింగ్ కమిటీలు పూర్తిస్థాయి శ్రద్ధ తీసుకొని క్రీడాపోటీల ఏర్పాట్లకు చర్యలు గైకొనాలన్నారు. క్రీడాపోటీలకు సంబంధించిన క్రీడా పరికరాలు ఇంకా రాకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టరు సూచించారు. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీ వంటి క్రీడాపోటీల నిర్వహణ ప్రదేశాల్లో షామియాన, ఆరోగ్యశిబిరాలు, తాగునీటి వసతి, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని సంబంధిత అధికారులను అదేశించారు. ఈసమావేశంలో డిపిఓ మంజులవాణి, డిఎల్డిఓ కళ్యాణి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల కోసమే వైసీపీ ప్రభుత్వము - ఎమ్మెల్యే శిల్పా రవి



**నంద్యాల క్రైం, డిసెంబరు 19, ప్రభాతవార్త:** పేదల కోసమే పురుడుపోసుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండని మంచిచేసే ప్రభుత్వం ఏ పార్టీ లేదని ఒక్క వైయస్ఆర్‌సీపీ పార్టీయేనని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పేదల సంక్షేమం కోసం నవరత్నాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి కుటుంబంలో ఎక్కడికి వెళ్లినా ప్రజలు నిండుమనస్సుతో ఆశీర్వదిస్తున్నారని గత ఎన్నడు లేని అభివృద్ధి నంద్యాలలో మెడికల్ కళాశాల, ప్రభుత్వాసుపత్రి అర్బన్ హెల్త్ సెంటర్లు, నాడు నేడు ద్వారా ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మంగళవారం బొమ్మలసత్రంలో 197వ రోజు గడప గడపకు మనప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆ వార్డు ప్రజలు వైసీపీ నాయకులు అపూర్వస్వాగతం పలికారు. గడప గడపకు తట్టుతూ ప్రజలను అమ్మా, అక్కా తాతయ్యలను అప్యాయంగా పలకరిస్తు సంక్షేమ పథకాలు వివరించారు. సమస్యలు ఏమైనా ఉంటే నా దృష్టికితీసుకురావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో విద్య వైద్యానికి పెద్దపీట వేస్తున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సమాజానికి మంచిచేసే నాయకుడు ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. గత తెదేపా పాలకులు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని మరోసారి తెరపైకి తూతువాగ్దానాలతో బయటి ప్రపంచానికి వెల్లబుస్తున్నారని వారి మాటలు నమ్మిమోసపోవద్దని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శశికళారెడ్డి, వార్డు ఇంచార్జ్ కాసిం, నంద్యాల జిల్లా వైసీపీ జనరల్ సెక్రెటరీ శ్రీనివాసరావు, మాధవరెడ్డి, డి దస్తగిరి, ఆశోక్‌రెడ్డి, ఆర్టీసి భాస్కర్‌రెడ్డి, జమాల్ బాష, అనంతలక్ష్మీ, ఖా ద్రీ షరీఫ్, నాగరాజు.సన్నీ, రమణ, శివాజీరావు, రమణారెడ్డి, విజయ్ కుమార్, అనిల్ అమృతరాజు, రెవిన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## చరిత్రకు నిదర్శనమే క్రీస్తు జన్మ



**ఆదోనిలీగల్, డిసెంబర్19, ప్రభాతవార్త;** ప్రపంచ చరిత్రకు నిదర్శనమే క్రీస్తు జన్మము అని, అందుకే చరిత్రలో క్రీ.పూ., క్రీ.శ. అని రచించడం జరిగిందని ఏలూరు మేత్రాసన కతోలిక గురువు రెవరెండ్ ఫాదర్ కొలకలూరి రాయప్ప ఉప్పలపాడు విచారణ గురువులు ఫాదర్ బిట్రోలు అన్నారు. మంగళవారం ఆదోని మండిగిరి బాలయేసు చర్చిలో విచారణ గురువు డీన్ రెవరెండ్ ఫాదర్ కోల విజయరాజు ఆధ్వర్యంలో ఘనంగా ఒకరోజు ప్రార్థనా కూడిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుడు పరలోకాన్ని వీడి మానవ మాత్రుడిగా పశువులపాకలో జన్మించాడన్నారు. సర్వ సృష్టిని కాపాడడానికి ఆయనే స్వయంగా వచ్చాడన్నారు. మంచి మనస్సుతో ఏ పని చేసినా మనిషి మళ్లీ పుడతాడన్నారు. క్రిస్మస్ అంటే ప్రేమ అని అర్థం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్య స్త్రీలు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

## శ్రీ రాఘవేంద్రస్వామి సన్నిధిలో మాజీ ఉపముఖ్యమంత్రి



**మంత్రాలయం, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కర్ణాటక మాజీ ఉపముఖ్యమంత్రి ఈశ్వరప్ప మంగళవారం మంత్రాలయం విచ్చేశారు. వీరికి శ్రీమఠం అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీమఠం ఆనవాయితీ ప్రకారం ముందుగా గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని మంగళ హారతులిచ్చారు. అనంతరం శ్రీ రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. శ్రీమఠం ప్రాకారంలో తిరుగుతూ మొక్కులు తీర్చుకున్నారు. వీరికి శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థులు శ్రీ రాఘవేంద్రస్వామిమెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలతో ఆశీర్వదించారు. వీరివెంట పిఆర్ఓ వ్యాసరాజాచారి తదితరులు ఉన్నారు.

## పేదల జీవితాల్లో వెలుగులు నింపిన జగన్



**నంద్యాల క్రైం, డిసెంబరు 19, ప్రభాతవార్త:** వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెనుమార్పులు, సంస్కరణలతో విద్యార్థుల తలరాతలు మారిపోతున్నాయని వారి జీవితాల్లో వెలుగులు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో ఆవార్డు కౌన్సిలర్ నాగిని రవిసింగారెడ్డి అధ్వర్యంలో 184వ రోజుకు చేరుకుంది. పేదలు, మహిళలు, రైతుల సంక్షేమాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. నాలుగున్నర సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి రారాజుగా నిలిచారని ఆయన కొనియాడారు. ప్రజలకు పారదర్శకంగా పథకాలు అందించేందుకు సచివాలయ, వాలింటర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. తద్వారా ఎటువంటి అవినీతికి తావులేకుండా ప్రజల్లోకి వెళ్తున్నాయని వివరించారు. ప్రతిఇంటా ప్రజలు సంతోషాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. వైయస్ జగన్‌రెడ్డి పాలనలో పూరిగుడిసెల్లో ఉన్నవారు కూడ డాక్టర్లు, ఇంజనీర్లు అవుతున్నారని పేర్కొన్నారు. మరోసారి ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం తథ్యమని తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టరు సునీత అమృతరాజు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్లు గంగిశెట్టి శ్రీదర్, పాంషావలి, పట్టణ అధ్యక్షులు పదగండ్ల సుబ్రమణ్యం, పున్నా శేషయ్య, జాకీర్ హుసేన్, దాల్‌మిల్ అమీర్. జయప్రకాష్, వెంకటరెడ్డి, ప్రధ్యున్నరెడ్డి, ఆంధ్రమెడికల్ రమేష్, చల్లా సత్యం, దామోదర్‌రెడ్డి, చాకలి పుల్లయ్య, కౌన్సిలర్లు తమీమ్, మజీద్, షాదిక్, కలాం, మేస చంద్రశేఖర్, కృష్ణమోహన్, పున్నా రాజేశ్వరీ, షహెనాజ్, అనుషా, తబ్రేజ్, కో-అప్షన్ సభ్యులు శోభారాణి, సలాముల్లా, లక్ష్మీనారాయణ, సోమశేఖర్‌రెడ్డి, కార్ రవికుమార్, అమృతరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేసిన అంగన్‌వాడీ కార్యకర్తలు



**వత్తికొండ, డిసెంబర్19, ప్రభాతవార్త:** తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత ఆరు రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు నిరవధిక దీక్షలు చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోవడంతో మంగళవారం పత్తికొండ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి ఇంటి ఎదురుగా మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు పేర్కొన్నారు. నిరసన ఉన్న తమను లెక్క చేయకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను సచివాలయ సిబ్బందితో కేంద్రాల తాళాలను పగలగొట్టించి కేంద్రాలను తెరవడం ఎంతవరకు సమంజసమని వారు పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ వేతనం ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని అలాగే తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరుతున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే దీక్షలను కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని వైసీపీ ఎమ్మెల్యేల ఇంటి ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంతమ్మ, పద్మ, శోభ, గోపాల్, వీరమ్మ, బురుజుల రాముడు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం

- వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి



**బనగానపల్లె, డిసెంబర్19, ప్రభాతవార్త:** మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం సాధ్యమవుతుందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి పేర్కొన్నారు. బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో జెడ్పీహెచ్ హైస్కూల్ నందు గుండం శేషిరెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లి జన్మనిస్తే చెట్టు ఆరోగ్యాన్నిస్తుందని, చెట్లు ప్రగతికి సోపానమని తెలిపారు. ప్రతిఒక్కరు చెట్లను నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. దీని వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. చెట్ల పెంపకం వల్ల సకాలంలో వర్షాలు కురువడంతో కరువుకాటకాలు రాకుండా ఉంటాయని అలాగే వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గిస్తుందని ఆయన పేర్కొన్నారు. చెట్ల పెంపకం వల్ల పరిసరాలు ఆహ్లాదకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గౌరి శంకర్, పీఈటీ వెంకటరాముడు, జగదీశ్వరరెడ్డి, రాంబాబు, వంశీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శిగా జిట్టా లక్ష్మీదేవి



**తుగ్గలి, డిసెంబరు 19, ప్రభాతవార్త :** తుగ్గలి మండలం ఎర్రగుడి గ్రామానికి చెందిన వైకాపా మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్ సతీమణి, మాజీ సర్పంచ్, పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ జిట్టా లక్ష్మీదేవిని వైసిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శిగా ఎంపికైంది. వైసిపి బిసి సెల్ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన జిట్టా లక్ష్మీదేవి, కుటుంబ సభ్యులు ఎర్రగుడి గ్రామ పంచాయతీకి మూడుసార్లు సర్పంచ్‌గా, ఒకసారి ఎంపిటిసిగా, ఒకసారి మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా పనిచేశారు. అయితే ప్రస్తుతం జిట్టా లక్ష్మీదేవి భర్త జిట్టా నాగేష్‌యాదవ్ వైకాపా మండల కన్వీనర్‌గా ఉన్నారు. అలాగే జిట్టా నాగేష్ కుటుంబం వైసిపి పార్టీ ఆవిర్భావం నుండి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా జిట్టా లక్ష్మీదేవి మాట్లాడుతూ తనకు వైసిపి జిల్లా బిసి సెల్ కార్యదర్శిగా పదవి అప్పగించిన సిఎం జగన్‌క జీవితాంతం రుణపడి ఉంటానని, అలాగే పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు, మండల వైసిపి నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



**బనగానపల్లె, డిసెంబర్19, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలోని డీపీఎం ఆఫీస్ నందు ఐజీజీఏఆర్ఎల్‌లో భాగంగా ప్రవేశపెట్టిన రైతు శాస్త్రవేత్త కోర్సు నిమిత్తం మొదటి సెమిస్టర్‌లో భాగంగా రైతు శాస్త్రవేత్త విద్యార్థులకు కోర్సు సబ్జెక్టులకు సంబంధించి మంగళవారం మెటీరియల్ జారీ చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా స్టేట్ ఆఫీసర్ టి.ఎల్.ధర్మేంద్రా, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి మరియు స్టేట్ టీమ్ రాజేశ్వర్, డీపీపీ అధికారి పాల్గొని 43 మంది విద్యార్థులకు మెటీరియల్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని మంచి ప్రతిభ చూపాలని వారు సూచించారు. అలాగే భవిష్యత్తులో మంచి వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగా రైతులకు మంచి సలహాలు, సూచనలు ఇచ్చి వారి ఎగుదలకు దోహదపడాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలు



**ఆలూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త :** పట్టణంలోని ఉమా ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు బ్రదరన్ క్రిస్టియన్ అసెంబ్లీ నిర్వాహకులు పాస్టర్ శ్యాంబాబు ఆద్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మిగనూరుకు చెందిన పాస్టర్ ఎబ్నేజర్ పవిత్రన్ హాజరయ్యారు. క్రీస్తు జననం సర్వలోక మానవాళికి ఎంతో శుభదాయకమన్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగకు సూచికగా క్యాండిల్స్ వెలిగించి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల పాస్టర్లు, యువకులు, చిన్నారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## వాటర్ బాడీస్ ఆక్రమణలను తొలగించండి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.జి.సృజన



**కర్నూలు, డిసెంబరు 19, ప్రభాతవార్త :** హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం వాటర్ బాడీస్ ఆక్రమణలను తొలగించాల్సిందిగా జిల్లా కలెక్టర్ డా జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో వాటర్ బాడీస్ ఆక్రమణలపై జాయింట్ కలెక్టర్, మునిసిపల్ కమిషనర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాటర్ బాడీస్ ఆక్రమణలను తొలగించాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన నేపథ్యంలో తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులను ఆదేశించారు.. మొదట వాటర్ బాడీస్ ఆక్రమణలు ఎన్ని ఉన్నాయో నిర్ణీత ప్రొఫార్మా లో సేకరించాలన్నారు.. ఇందులో నాన్ రెసిడెన్షియల్, వ్యవసాయానికి సంబంధించిన వాటర్ బాడీస్ ఆక్రమణలను నోటీసులు ఇచ్చి వెంటనే పొసెషన్ లోకి తీసుకోవాలన్నారు.. రెసిడెన్షియల్ ఆక్రమణలకు సంబంధించి నోటీసులు జారీ చేసి తొలగింపుకు కొంత సమయం ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్ డి ఓ రామలక్ష్మి, కర్నూల్ ఆర్డిఓ హరిప్రసాద్, ఇరిగేషన్ ఎస్ ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, డీఎఫ్ఓ శివశంకర్ రెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు, గూడూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మీ పొలాల ధరలు చెప్పండి..పరిశీలిస్తాము-జేసి



**కోవెలకుంట్ల, డిశంబరు 19, ప్రభాతవార్త :** నేషనల్ జాతీయ రహదారి 167కె కింద భూములు కోల్పోతున్న రైతుల కోరుకునే ధరను చెప్పాలని నంద్యాల జాయింట్ కలెక్టరు రాహుల్‌కుమారరెడ్డి కోరారు. మంగళవారము కోవెలకుంట్ల మండల రెవెన్యు కార్యాలయ అవరణలో నంద్యాల జాయింట్ కలెక్టరు రాహుల్‌కమారరెడ్డి నేషనల్ జాతీయ రహదారికి సంబందించి భూముల కోల్పోతున్న జోలదోరావి, కలగొట్ల, రేవనూరు, ఉప్పలూరు, చింతకుంట, కోవెలకుంట్ల, పొట్టిపాడు, గుల్లదుర్తి గ్రామాలకు చెందిన రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. ఈసందర్భముగా రైతులను ఉద్దేశించి జేసి మాట్లాడుతూ మీరు భూములు ఇల్లు కలిగిన యజమానులుగా మీ మనస్సు నందు ఎంత ధర పలుకుందో చెప్పాలని జేసి కోరారు. అయితే మీరు ఎంత ఇస్తారో చెప్పాలని రైతులు కోరారు. దీనికి స్పందించిన జేసి గతంలో, ప్రస్తుతము గ్రామాల్లో మీ భూముల ధరలు ఎంత పలుకుతున్నాయో మీరు చెప్పాలని కోరారు. భూములు ఇల్లు కోల్పోతున్న రైతులు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్ల యందు మీ దృవపత్రాలు, మీరు కోరుకునే దరను అంద చేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో ఆర్డిఓ వెంకటరెడ్డి, తహశీలుదారు పుష్పకుమారి రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**కర్నూలు అర్బన్, డిసెంబరు 19, ప్రభాతవార్త:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా క్రిస్మస్ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వి.వెంకటరంగారెడ్డి తెలిపారు ఆసుపత్రిలోకి సిబ్బందికి, నర్సింగ్ సిబ్బందికి ముందుగానే క్రిస్మస్ శుభాకాంక్షలు తెలి పారు. ఆసుపత్రిలో అన్నిమతాల వారితో సంబరాలు చేయించడమనేది చాల శుభ పరిణామని తెలిపారు. అనంతరం ప్రజలంతా ఐక్యమత్యాన్ని పెంపొందిం చుకోవడమే కాక సోదరభావం, ప్రేమను కలిగి సమాజాభివృద్ధిని సాధించా లని సూచించారు. ఈకార్యక్రమానికి ఆసుపత్రి డిప్యూటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, సిఎస్ఆర్ఎంఒ డా.వెంకటేశ్వర్‌రావు, ఆసుపత్రి డిప్యూటి సి ఎస్ఆర్ఎంఒ డా.హేమనలిని, ఆర్ఎంఒ డా.వెంకటరమణ, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్స్ డా.శివబాలనగంజన్, డా.కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెం డెంట్‌లు జి-1 వెంకటతులశమ్మ, జి-2 సావిత్రిబాయి, నాగమణిలు తదితరులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేసిన ఎంఎల్ఏ



**మంత్రాలయం, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలంలోని వివిధ గ్రామాల రైతులకు ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అసైన్డ్ భూములకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్టర్ పత్రాలను ఎంఎల్ఏ వై.బాలనాగిరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని మాధవరం, రాంపురం, 52-బసాపురం, రచ్చుమర్రి, సూగూరు, చిలకలడోణ తదితర గ్రామల రైతుల భూముల రిజిస్ట్రేషన్ పత్రాలను మొత్తం 162 మంది రైతులకు ఎంఎల్ఏ అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ భూములపై ఉన్న ఋణాలను మాఫీచేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అసైన్డ్ భూములు కలిగి ఉన్న రైతులకు రిజిస్టర్ చేసి భూములపై సర్వ హక్కులు కల్పించినట్లు తెలిపారు. కాబట్టి రైతులందరూ ముఖ్యమంత్రి జగన్‌ను మరచిపోకుండా రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌ను, ఎంఎల్ఏగా బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ఇంఛార్జ్ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్‌కుమార్, తహశిల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఆనందు, విఆర్ఓలులు ప్రభాకర్, శ్వేత, నవ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో 100పొట్టేలు మృతి

- పరిశీలించిన డాక్టర్ల బృందము



**కోవెలకుంట్ల, డిశంబరు 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సంజామలల్లో కుక్కల దాడిలో శివుడికు చెందిన 100పొట్టేలు మృతి చెందినట్లు బాదితుడి చెప్పారు. వీటి విలువ సుమారు రూ 5లక్షల వరకు ఉంటుందని బాదితుడు వాపోయారు. విషయం తెలిపిన వెంటనే సంజామల యస్ఐప్రతాప్ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టరు, స్పెషల్ అఫీసరు డాక్టరు మోహన్ రావు మృతి చెందిన పొట్టేళ్ల మృత దేహాలను పరిశీలించారు. బాదితునితో మాట్లాడి పూర్తి వివరాలను ప్రభుత్వంకు నివేదిక ప అంపుతామని చెప్పారు.